


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684



**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | గురువారం | 17.07.2025 | సంపుటి : 2 | సంచిక :164 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Thursday | 17.07.2025 | volume : 2 | Issue : 164 | Pages : 8 | Cost : 2/- |





# కాళేశ్వరంలో అవినీతి జలగలు

## ఏసీబీ దాడులతో పట్టుబడుతున్న అధికారులు

### అవినీతిపై దృష్టి సారించిన ఈడీ

**హైదరాబాద్, జూలై 16 :** కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో క్రమ క్రమంగా అవినీతి అధికారుల దోపిడీ వెలుగులోకి వస్తోంది. ఎసిబి దాడులతో ఒక్కొక్కరి బాగోతం బయటపడుతోంది. అక్రమంగా వందల కోట్లు దిగమింగినట్లు తెలుస్తోంది. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ-దశల లిఫ్ట్ ఇరిగేషన్ పథకంగా ప్రచారం పొందింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో అనేక అక్రమాలు, నాణ్యతా లోపాలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. మెడిగడ్డ బ్యారేజీ వద్ద పియర్లు కుంగిపోవడం, నిర్మాణంలో లోపాలు, డిజైన్ లోపాలను నేషనల్ డామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, ఈ ప్రాజెక్టులో పనిచేసిన అధికారులపై అవినీతి ఆరోపణలు తీవ్రమయ్యాయి. ఈ విషయంపై జస్టిస్ పీసీ ఘోస్ కమిషన్ విచారణ జరుపుతోంది. ఈడీ ఈ కేసులో నగదు లావాదేవీలపై దృష్టి సారించింది. ఈ క్రమంలో మాజీ ఇంజనీర్-ఇన్ చీఫ్ మురళీధర్ రావు ఈ ప్రాజెక్టు నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు.

మిగతా 2 లో

# జల వివాదాలపై కమిటీ

## కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు

- రెండు రాష్ట్రాలతోపాటు కేంద్ర అధికారులకూ భాగస్వామ్యం
- సాంకేతిక నిపుణులు, ఐఏఎస్‌లకూ స్థానం
- టెలిమెట్రీల ఏర్పాటు, కృష్ణా బోర్డు అమరావతికి తరలింపు
- శ్రీశైలం ప్రాజెక్టుకు ఏపీ నిధులతో మరమ్మతులపైనా ఏకాభిప్రాయం
- దిల్లీలో ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రుల భేటీలో నిర్ణయాలు



తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాల పరిష్కారానికి అడుగు పడింది. చర్చల ద్వారా పరిష్కరించుకోవడంతో పాటు కమిటీ ఏర్పాటు చేసి ముందుకు సాగాలని నిర్ణయించారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ఆధ్వరంలో జరిగిన భేటీ సుహృద్భావ వాతావరణంలో జరిగింది.. జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం జరిగింది.. ఈ సమావేశానికి రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి.. నీటిపారుదల శాఖ మంత్రులు నిమ్మల రామానాయుడు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి హాజరయ్యారు.. గోదావరి, కృష్ణా జలాల వినియోగం, ప్రాజెక్టుల నిర్మాణాలపై చర్చ సాగింది..

**న్యూఢిల్లీ, జూలై 16 :** తెలుగు రాష్ట్రాల్లో గోదావరి, కృష్ణా జలాలకు సంబంధించి వివాదాల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేయాలని కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ, ఏపీ సీఎంల సమావేశం నిర్ణయించింది. దీంతో పాటు మరో మూడు అంశాలపైనా ఏకాభి ప్రాయం కుదిరింది. దిల్లీ శ్రమశక్తి భవన్ వేదికగా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహిం చిన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. దాదాపు గంటన్నరకు పైగా నిర్వహించిన ఈ సమావేశంలో తెలుగు రాష్ట్రాలు ప్రతిపాది ంచిన 10 ఎజెండా అంశాలపై చర్చ జరిగిం ది. తెలంగాణ, ఏపీ సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నీటిపారుదలశాఖ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నిమ్మల రామానాయుడు, ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, విజయానంద్ చర్చల్లో పాల్గొన్నారు. జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ సమావేశాన్ని ప్రారంభించి, అవసరమైన సందర్భాల్లో కలగజేసుకున్నారు. ఎవరి వాదనలు వారు వినిపించడంతో ఆసక్తికర చర్చలు జరిగాయి. ఏపీ సీఎం చంద్రబాబు తనకు రెండు తెలుగు రాష్ట్రాలూ ముఖ్యమేనని స్పష్టం చేయడంతో పాటు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండగా తెలంగాణ ప్రాజెక్టులు ఎలా చేపట్టిందీ వివరించారు. సమావేశంలో మూడు అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు. జలవివాదాలపై కమిటీ ఏర్పాటు వచ్చే సోమవారం నాటికి పూర్తి కావాలని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఎవరెవరు కమిటీలో ఉండాలో ఆ వివరాలు తాము సోమవారం నాటికి అందిస్తామని రెండు రాష్ట్రాలూ పేర్కొన్నాయి. దేబశ్రీ ముఖర్జీ స్పందిస్తూ, సోమవారం నాటికి కేంద్రం నుంచి కమిటీ సభ్యులను తేల్చడానికి ప్రయత్నిస్తామన్నారు. ప్రస్తుత ఎజెండా అంశాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్న వాటిని కమిటీకి అప్పజెబుతారు. సాంకేతిక, ఇతర అంశాలపై ఆ కమిటీ చర్చించి అభిప్రాయాలు, నిర్ణయాలు తెలియజేస్తుంది. అక్కడ పరిష్కారం కాని అంశాలపై మళ్లీ ఇద్దరు ముఖ్యమంత్రులూ చర్చించి పరిష్కరించుకోవాలని నిర్ణయించారు.

మిగతా 2 లో



## బనకచర్ల ప్రతిపాదనే రాలేదు

- ఈ భేటీ విఫలమైతే బాగుండని కొందరు ఎదురుచూశారు
- అధికారం కోల్పోయిన దుఃఖం వారిది
- వారికి పదేళ్లు అవకాశమిచ్చినా పరిష్కరించలేదు
- సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే మా బాధ్యత
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

02



## నిమిష కేసులో కొత్త మలుపు

- బ్లడ్‌మనీకి అంగీకరించేది లేదన్న మృతుడి సోదరుడు
- న్యాయం కోసం ఎదురు చూస్తున్నామని వెల్లడి
- శిక్ష పడాల్సిందేనని డిమాండ్

10

## దసరా నాటికి ఉప్పల్ పై ఓవర్ పూర్తి

పనుల తీరును పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి

04





10

## రష్యాతో వ్యాపారం చేస్తే భారత్‌పై 100 శాతం సుంకం

నాటో హెచ్చరికలు

# మహిళలకు స్వయం ఉపాధి పథకాలు



- కోటిమందిని కోటీశ్వరులు చేసే బాధ్యత
- పెద్దపల్లిలో వీ హబ్ ఏర్పాటుకు కృషి
- ఇందిరాశక్తి సంబరాల సభలో మంత్రి శ్రీధర్ బాబు

03

మహిళలకు ఉపాధి కల్పించే కార్యక్రమాలు చేపట్టామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. మహిళలను కోటీశ్వరులు చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. పెద్దపల్లిలో ఏర్పాటు-చేసిన ఇందిరాశక్తి సంబరాల సభకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, ఎమ్మెల్యే విజయరమణరావుతో కలిసి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

# సవాళ్లు విసరడం... పారిపోవడం రేవంత్ నైజం

- ఇలాంటి వారు పదవుల్లోకి వస్తారని అంబేద్కర్ ఊహించలేదు
- దళిత బంధు సాధనసమితి సమావేశంలో కేటీఆర్ ఫైర్

03



చర్చలకు రమ్మని సవాళ్లు విసరడం.. పారిపోవ డం రేవంత్‌కు అలవాటు అయ్యిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ రాజకీయాల్లో ప్రతిపక్ష, అధికార పార్టీల నడుమ సవాళ్ల పర్వం కొనసాగుతోంది. మరోసారి సీఎం రేవంత్ రెడ్డిపైకేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అంబేద్కర్ రాజ్యాంగం రాసినప్పుడు రేవంత్ రెడ్డి లాంటి దొంగలు, లంగలు పదవుల్లోకి వస్తారని ఊహించలేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు.



10

## నిన్నటి ఆయుధాలతో నేటి యుద్ధం జయించలేం

సీడీఎస్ అనిల్ చౌహాన్



10

## కోట్ల మంది చనిపోయినా.. యాక్టివ్‌లోనే ఆధార్ కార్డులు

# రాజకీయ అవకాశం దక్కని కులాలకు పదవులు

- 42శాతం రిజర్వేషన్లలో ఆయా కులాలకు పెద్దపీట
- 25వేల మంది బిసిలకు పదవులు దక్కే వరకు పోరాటం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత

25వేల మంది బీసీలు ప్రజాప్రతినిధులు అయ్యే వరకు తెలంగాణ జాగృతి పోరాటం చేస్తుందని తెలం గాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. 25వేల పదవుల్లో సగం మంది మన ఆడబిడ్డ లకే అవకాశం దక్కుతుం దని అన్నారు. 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తే ఇప్పటివరకు రాజకీ య అవకాశాలు దక్కని కులాలకు సబ్ కోటా కల్పించాలని డిమాండ్ చేశారు.



03

'పీఎం ధన్ ధాన్య కృషి యోజన'కు

# కేంద్ర క్యాబినెట్ ఆమోదం

## 100 జిల్లాల్లో అమలు



04

'పీఎం ధన్ ధాన్య కృషి యోజన'కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. వ్యవసాయ, అనుబంధ రంగాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఏటా రూ.24వేల కోట్ల వ్యయంతో దేశ వ్యాప్తంగా 100 జిల్లాల్లో ఈ ప్రోగ్రామ్‌ని అమలు చేయనున్నారు. 2025-26 నుంచి ఆరేళ్ల కాలానికి 100 జిల్లాలను కవర్ చేసేలా దీన్ని చేపట్టనున్నారు.

# ముఖం చాటేసిన వర్షాలు



- నైరుతి కానరాక రైతుల్లో ఆందోళన
- వేసిన పంటలు దక్కుతాయా లేదా అన్న భయం

04

అనేక జిల్లాల్లో వర్షాలు రైతులను ఊరించి ఉసూరుమనిపించాయి. వానాకాలం సీజన్ ప్రారంభమై 45 రోజులు దాటుతున్నా, సరైన వానలు కురవకపోవడంతో వేసిన విత్తనాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. మే నెల రెండో వారంలో కురిసిన వర్షాలతో అన్నదాతలు సంతోషపడ్డారు. కొంద రు పత్తి విత్తనాలు నాటుకోగా, మరికొందరు వరి నారుమడులు దున్నుకున్నారు. ఇంకొందరు నేరుగా వడ్లు చల్లుకున్నారు. ఆ తర్వాత అడపాదడపా వర్షాలు తప్ప వానలు జోరందుకోవడం లేదు. దీంతో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు లోటు- వర్షపాతమే నమోదైంది.

# జల వివాదాలపై కమిటీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత నదీ జల వివాదాలు పరిష్కరించేందుకు విభజన చట్టం ప్రకారం ఎపెక్స్ కౌన్సిల్ ఏర్పాటయింది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి నేతృత్వంలో రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అందులో సభ్యులు. ఇంతవరకు రెండుసార్లు ఎపెక్స్ కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. ప్రస్తుతం అదే తరహా సమావేశం కేంద్ర జలశక్తి శాఖ ఏర్పాటు చేయడంతో ఈ సమావేశంపై అనుమానాలు ఏర్పడ్డాయి. దీంతో భేటీ ప్రారంభంలోనే ఏపీ సీఎం చంద్రబాబు ఇది ఎపెక్స్ కౌన్సిల్ సమావేశమా అని ప్రశ్నించారు. కాదని కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ సమాధానమిచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సమస్యల పరిష్కారానికి ఇదొక వేదికగా నిలుస్తుందని, ఏకాభిప్రాయంతో నిర్ణయాలు తీసుకుంటే వాటిని అమలు చేస్తామని వెల్లడించారు. ఇందుకు తగ్గట్టే సమావేశం యావత్తూ కేంద్ర జలశక్తి శాఖ మంత్రి పాటిల్ ప్రేక్షక పాత్ర వహించారు. గోదావరి, కృష్ణా నదులకు సంబంధించి వివాదాల పరిష్కారానికి కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు. రెండు రాష్ట్రాల సాంకేతిక నిపుణులతో పాటు జలశక్తి శాఖ నుంచి కమిటీలో సభ్యులు ఉంటారు. సాంకేతిక నిపుణులు, ఇంజినీర్లు మాత్రమే కాకుండా పాలనాధికారు (ఐఏఎస్)లకు కూడా ఈ కమిటీలో భాగస్వామ్యం కల్పిస్తారు. వచ్చేవారం ప్రారంభానికి కమిటీ ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తారు.



ఈ కమిటీ నెల రోజుల్లో రోడ్‌మ్యాప్ ఇస్తుందని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. పోలవరం- బనకచర్ల అనుసంధానం అంశాన్ని కూడా ఈ కమిటీ పరిశీలిస్తుందని ఏపీ మంత్రి రామానాయుడు తెలియజేశారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని అమరావతికి తరలింపు. కృష్ణా, గోదావరి నదుల నుంచి కాలువలకు నీళ్లు తీసుకునే అవుట్‌లెట్‌ల వద్ద టెలిమెట్రీల ఏర్పాటుకు అనుమతి. కేవలం ఆయా నదులకు సంబంధించిన రిజర్వాయర్ల నుంచి నీటిని తీసుకునేచోట మాత్రమే టెలిమెట్రీల ఏర్పాటు. అంతర్గత అవుట్‌లెట్‌ల వద్ద ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని ఆంధ్రప్రదేశ్ పేర్కొంది. శ్రీశైలం ప్లంజ్‌పూల్ సహా అవసరమైన మరమ్మతు పనులు ఏపీ చేపట్టేందుకు నిర్ణయం. ఈ మేరకు రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నట్లు ఆ తర్వాత కేంద్ర జలశక్తి శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రజల ప్రయోజనార్థం సుస్థిర జల నిర్వహణ పద్ధతులను ప్రోత్సహించేందుకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించింది.

# కాళేశ్వరంలో అవినీతి జలగలు

(మొదటిపేజీ తరువాయి)

ఆయనపై అవినీతి ఆరోపణలు రావడంతో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంతో సహా 10 ప్రాంతాల్లో ఏసీబీ సోదాలు నిర్వహించగా, దాదాపు 200 కోట్ల రూపాయల విలువైన ఆస్తులు గుర్తించారు. ఇందులో విల్లాలు, ఫ్లాట్‌లు, ఓపెన్ ఎ÷-లాట్‌లు, వాణిజ్య భవనాలు, బ్యాంక్ డిపాజిట్లు, బంగారం వంటివి ఉన్నాయి. ఈ క్రమంలో ఈ ప్రాజెక్టులో పనిచేసిన మరికొంత మంది ఇంజనీర్లపై కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఫోకస్ చేసింది. ప్రభుత్వ ధనాన్ని సొంత కంపెనీల్లో పెట్టుబడులుగా మళ్లించడం, విదేశాల్లో ఖరీదైన డెస్టినేషన్ వెడ్డింగ్‌లు నిర్వహించడం వంటి అక్రమాలపై ఈడీ విచారణను ముమ్మరం చేసింది. ఈ సందర్భంగా, మాజీ ఇంజనీర్-ఇన్-చీఫ్ మురళీధర్ రావు, ఎక్స్‌క్యూటివ్ ఇంజనీర్ నూనె శ్రీధర్, మాజీ ఇంజనీర్-ఇన్-చీఫ్ భూక్యా హరిరామ్ నాయక్ సహా పలువురిపై ఆరోపణలు ఉన్నాయి. ఈడీ దృష్టి ఇప్పుడు మురళీధర్ రావు కొడుకు అభిషేక్ రావు నడుపుతున్న కంపెనీలపై కూడా ఫోకస్ చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు సంబంధిత లావాదేవీల ద్వారా అక్రమంగా సంపాదించిన డబ్బును అభిషేక్ రావు కంపెనీల్లో పెట్టు-బడులుగా మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ పెట్టు-బడులపై ఈడీ విచారణను ముమ్మరం చేసింది. ఈ కేసులో ఏసీబీ గుర్తించిన ఆస్తులు, లావాదేవీల వివరాలను ఈడీ అధికారులు కోరనున్నారు. క్స్‌క్యూటివ్ ఇంజనీర్ నూనె శ్రీధర్ కూడా కాళేశ్వరం ప్రాజెక్టులో మూడు ప్యాకేజీలలో పనిచేశారు. ఆయన ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ అరెస్టు చేసింది. 13 ప్రాంతాల్లో నిర్వహించిన సోదాల్లో 4500 చదరపు అడుగుల ఫ్లాట్, విల్లా, 19 రెసిడెన్షియల్ ఎ÷-లాట్‌లు, 16 ఎకరాల వ్యవసాయ భూమి, హోటల్ పెట్టు-బడులు వంటి ఆస్తులు గుర్తించారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, శ్రీధర్ తన కొడుకు పెళ్లి కోసం థాయ్‌లాండ్‌లో కోట్ల రూపాయలు ఖర్చు చేసి డెస్టినేషన్ వెడ్డింగ్ నిర్వహించారు. ఈ ఖర్చులపై ఈడీ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ లావాదేవీల వెనుక ఉన్న ఆర్థిక వనరులను గుర్తించేందుకు విచారణ చేపడుతోంది. మాజీ ఇంజనీర్-ఇన్-చీఫ్ భూక్యా హరిరామ్ నాయక్ కూడా ఈ కేసులో ఆరోపణలను ఎదుర్కొంటు-న్నారు. ఏసీబీ ఏప్రిల్‌లో ఆయనను అరెస్టు చేసింది. 13 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించగా, విలాసవంతమైన విల్లాలు, భూములు, బంగారు ఆభరణాలు, బ్యాంక్ డిపాజిట్లు- వంటి ఆస్తులు గుర్తించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారని, అక్రమ లావాదేవీల ద్వారా ఆస్తులు కూడబెట్టినట్లు- ఆరోపణలు ఉన్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో మొదటిసారిగా ఈడీ నగదు లావాదేవీలపై దృష్టి సారించింది. ఈ ప్రాజెక్టు నిధులను అక్రమంగా సొంత కంపెనీల్లో, విదేశీ ఖర్చుల్లో పెట్టు-బడులుగా మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈడీ, ఏసీబీ నుంచి మురళీధర్ రావు, నూనె శ్రీధర్, హరిరామ్ నాయక్‌లకు సంబంధించిన అవినీతి కేసు వివరాలను కోరనుంది. ఈ విచారణ ద్వారా, ప్రాజెక్టు నిధుల దుర్వినియోగం, బినామీ లావాదేవీలు, అక్రమ ఆస్తుల సముపార్జన వంటి అంశాలను లోతుగా పరిశీలించనుంది.

# బనకచర్ల ప్రతిపాదనే రాలేదు

- ఈ భేటీ విఫలమైతే బాగుండని కొందరు ఎదురుచూశారు
- అధికారం కోల్పోయిన దుఃఖం వారిది
- వారికి పదేళ్లు అవకాశమిచ్చినా పరిష్కరించలేదు
- సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే మా బాధ్యత
- నదీ జలాల వివాదాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్:** 'ప్రజలు వాళ్లకు పదేళ్లు అధికారం ఇచ్చినా నదీ జలాల వివాదాలను పరిష్కరించలేదు. ఈరోజు జరిగిన రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో నాలుగు అంశాలకు పరిష్కారం లభించింది. మిగతా సమస్యల పరిష్కారానికి దారి లభించింది' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'ఈ సమావేశం ఎలాగైనా చెడిపోతే బాగుండు.. వీళ్లు గొడవ పడితే బాగుండు.. దాంతో మాకు రాజకీయంగా లాభం జరుగుతుంది..' అని కొందరు ఎదురుచూశారని వ్యాఖ్యానించారు. "వాళ్లనేం చేస్తాం? చూసి జాలిపడతాం. వాళ్ల బాధ మేము అర్థం చేసుకుంటాం. అధికారం పోయిన దుఃఖంలో వారు ఇలాంటి ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. మేము వాళ్ల కోసం లేము. తెలంగాణ ప్రజలకు జవాబుదారీగా ఉన్నాం. పరిపాలన ఏ విధంగా చేయాలో మాకు తెలుసు. సమస్యలను ఎలా పరిష్కరించాలో మాకు అవగాహన ఉంది. వివాదాలు చెలరేగకుండా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే మా బాధ్యత" అని స్పష్టం చేశారు. దిల్లీలో విలేకరుల సమావేశంలో సీఎం రేవంత్ పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. "గోదావరి.. బనకచర్ల కడతామని వారు(ఏపీ) అడిగితే కదా.. మేము ఆపమని చెప్పడానికి. ఆ ప్రతిపాదనే రానప్పుడు.. ఆపమనే చర్చే రాదు. ఇది ఎపెక్స్ కమిటీ సమావేశం కాదు.. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అంశాలపై చర్చించడానికి జలశక్తి మంత్రి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సమావేశం. కేంద్రం ఏ రాష్ట్రం పక్షానా నిలబడలేదు. ఏ ఎజెండాను కూడా సూచించలేదు. సమావేశంలో జలశక్తి మంత్రి పాటిల్ జడ్జి పాత్ర పోషించారు. ఏపీ కడుతున్న ప్రాజెక్టుల మీద మేము ఇప్పటికే ఫిర్యాదులు చేశాం. మా ఫిర్యాదుల మీద పోలవరం ప్రాజెక్టు అథారిటీ, సీడబ్ల్యూసీ, గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు.. ఏపీ ప్రభుత్వానికి అభ్యంతరాలు చెప్పాయి. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న సంస్థలే.. అన్ని రకాల అభ్యంతరాలు లేవనెత్తాయి కాబట్టి సమావేశంలో ఆ అంశాలు ప్రస్తావనకు రాలేదు.



## ఇది తెలంగాణ విజయం

మొత్తం తెలంగాణ హక్కులను కేసీఆర్.. ఏపీకి ధారాదత్తం చేశారు. అన్యాయం చేశారు. వాటిని పరిష్కరించడానికి మేము విధి విధానాలను ముందుకు తీసుకొచ్చాం. ఇది తెలంగాణ రాష్ట్ర విజయం. ఎందుకంటే ఏపీ తనకు కేటాయించిన నీళ్ల కంటే ఎక్కువ వినియోగిస్తుందని మేము ఫిర్యాదు చేసిన నేపథ్యంలో.. టెలీమెట్రీల ఏర్పాటుకు ఏపీ అంగీకరించింది. శ్రీశైలం డ్యామ్ నిర్వహణకు, మరమ్మతులకు, రక్షణకు కూడా ఏపీ ప్రభుత్వం అంగీకరించింది. ఇది కూడా తెలంగాణ ప్రభుత్వ విజయమే. దీర్ఘకాలిక పెండింగ్ అంశాలు గుర్తించడం కోసం కమిటీ ఏర్పాటుకు కూడా నిర్ణయం జరిగింది. గతంలో ఎపెక్స్ కౌన్సిల్‌లో తీసుకున్న నిర్ణయాలు అమలయ్యాయా? పార్లమెంటులో చట్టం చేస్తేనే.. ప్రధాని మోదీ అంగీకరించడం లేదు. అలా అనుమానించుకుంటూ పోతే ఏ అంశం పరిష్కారం కాదు. మేము నియమించిన కమిటీనే కదా.. ఆ కమిటీ సిఫార్సులను గౌరవిస్తాం. అంశాల వారీగా చర్చిస్తాం. తర్వాత తుది నిర్ణయం తీసుకుంటాం. చర్చిస్తున్నప్పుడు.. పోరాడాల్సిన అవసరం ఏముంది? అవసరమైనప్పుడు గల్లీ నుంచి దిల్లీ దాకా కొట్లాడతాం. అందుకు సిద్ధంగానే ఉన్నాం" అని రేవంత్ అన్నారు.

## నిధులు ఇచ్చినా, ఇవ్వకపోయినా అన్ని చోట్లా టెలీమెట్రీలు

"కృష్ణా జలాలలో.. ఏపీ ఎన్ని వినియోగిస్తుంది.. తెలంగాణ ఎన్ని వినియోగిస్తుందనేది గుర్తించడానికి, ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల లెక్కలు తేల్చేందుకు.. టెలీమెట్రీ పరికరాలను ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన సూచనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగీకరించింది. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం కొన్నిచోట్ల టెలీమెట్రీలను ఏర్పాటుచేసింది. మిగిలిన అన్నిచోట్లా ఈ పరికరాలను ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం, ఏపీ ప్రభుత్వం నిధులు ఇచ్చినా, ఇవ్వకపోయినా.. తెలంగాణ ప్రభుత్వమే అన్నిచోట్లా టెలిమెట్రీ పరికరాలను యుద్ధప్రాతిపదికన పెట్టాలని నిర్ణయించాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. దిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో కేంద్ర జలశక్తి మంత్రి ఆధ్వర్యంలో జరిగిన రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీలో పాల్గొన్న అనంతరం బుధవారం ఒక హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ మాట్లాడారు. "కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశం కావడం ఆహ్వానించదగిన పరిణామం. అన్ని సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని నిర్ణయం తీసుకున్నాం. శ్రీశైలం డ్యామ్‌లో కొన్ని ప్రమాదకరమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. తక్షణం మరమ్మతులు చేయాలని ఎన్డీఎస్ఏ సహా పలు సంస్థలు ఇచ్చిన నివేదికల్లోని అంశాలను భారత, ఏపీ ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాం. శ్రీశైలం ప్రాజెక్టుకు మరమ్మతులు, రక్షణ, నిర్వహణలకు సంబంధించి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగీకరించింది. ఏపీ పునర్విభజన చట్టంలో ఉన్నట్లుగా.. 2020లో ఎపెక్స్ కౌన్సిల్‌లో అప్పటి ముఖ్యమంత్రులు తీసుకున్న నిర్ణయం ప్రకారం.. గోదావరి బోర్డు హైదరాబాద్‌లో.. కృష్ణా బోర్డు ఏపీలో ఏర్పాటుకు తుది నిర్ణయం జరిగింది. ఇరు రాష్ట్రాల్లో గోదావరి, కృష్ణా నదులపై ఉన్న ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ సమస్యలను గుర్తించడానికి, చర్చించడానికి, పరిష్కారానికి సీనియర్ అధికారులు, ఇంజినీర్లు, నిపుణులతో కమిటీని వారం రోజుల్లో నియమించాలని నిర్ణయించాం. గోదావరి నది, దాని ఉపనదులు.. కృష్ణా నది, దాని ఉపనదులకు సంబంధించి అన్నీ చర్చకు వస్తాయి. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు, నిర్మాణానికి ప్రతిపాదించిన ప్రాజెక్టులు, ఇప్పుడున్న ప్రాజెక్టుల్లో నిర్వహణలో అంశాలు, అభ్యంతరం ఉన్న ప్రాజెక్టులు, నీటి కేటాయింపులు, అనుమతులు.. అన్నీ ప్రస్తావనకు వస్తాయి. వీటన్నింటిపై 30 రోజుల్లో మన తరఫున అధికారులు, ఇంజినీర్లు, నిపుణులు కమిటీ గుర్తించి చర్చకు తీసుకొస్తారు. ఆ కమిటీలో చర్చించిన తర్వాత.. ముఖ్యమంత్రుల స్థాయిలో మరోసారి భేటీ అయి చర్చించుకోవాలని నిర్ణయం తీసుకున్నాం. ఈ సమావేశంలో కేవలం పెండింగ్ అంశాలపై మాత్రమే చర్చించాం. ముందు సమస్యలను గుర్తించాలని నిర్ణయించాం. ఆ తర్వాత పరిష్కారంపై చర్చిస్తాం" అని సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. ఈ సమావేశంలో ఎంపీలు సురేశ్ షెట్కార్, కె.రఘువీర్‌రెడ్డి, వంశీకృష్ణ, అభిషేక్ మను సింఘ్వీ, మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రామసహాయం రఘురామిరెడ్డి, కడియం కావ్య, బలరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా

### అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు

**హైదరాబాద్:** భవిష్యత్‌లో ఏర్పడే విద్యుత్ డిమాండ్‌ను అధిగమించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. బుధవారం ఎస్పీడీసీఎల్‌లో విద్యుత్ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. "ప్రజలకు అత్యంత నాణ్యమైన కరెంటును రెప్పపాటు కాలం కూడా అంతరాయం లేకుండా అందిస్తున్నాం. గతేడాది మార్చి 24న 308.45 మిలియన్ యూనిట్లు సరఫరా చేయగా.. ఈ ఏడాది మార్చి 18న 335.19 మిలియన్ యూనిట్లు సరఫరా చేశాం. రాష్ట్ర చరిత్రలో ఇదే అత్యధికం. గతేడాది మార్చి 8న 15,497 మెగావాట్ల పీక్ డిమాండ్ ఏర్పడగా.. ఈ ఏడాది మార్చి 20న 17,162 మెగావాట్ల పీక్ డిమాండ్ ఏర్పడింది. సుమారు 2,000 మెగావాట్ల అదనపు డిమాండ్ ఏర్పడినప్పటికీ.. అంతరాయం లేకుండా సరఫరా చేయగలిగాం. పెరుగుతున్న అవసరాలు, అంచనాల నేపథ్యంలో.. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా కొత్త సబ్‌స్టేషన్లు నిర్మించాలి. ఈ క్రమంలో భూమి కోల్పోయినవారికి ఉద్యోగావకాశాలు కల్పించడంపై దృష్టి సారించాలి. స్థలం కొరత నేపథ్యంలో.. ప్రస్తుతం ఉన్న 12.5 మిలియన్ యూనిట్ల ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో 16 మిలియన్ యూనిట్ల పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలి. హైదరాబాద్‌లో భూగర్భ కేబుళ్ల నిర్మాణానికి పూర్తిస్థాయిలో డీపీఆర్ సిద్ధం చేయాలి" అని ఆదేశించారు. సమావేశంలో విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, జెన్‌కో సీఎండీ హరీశ్, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారుఖీ, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్నం వేళల్లోనూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

### ఆకస్మిక తనిఖీలు చేపడతామన్న ట్రాఫిక్ డిసిపి

**హైదరాబాద్, జూలై 16 :** హైదరాబాద్ లో వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు షాక్ ఇచ్చేందుకు రెడీ అవుతున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల విషయంలో మరింత స్పీడ్ పెంచేందుకు సిద్ధమవుతున్నారు. మధ్యాహ్నం కూడా తనిఖీలు చేసేందుకు ప్లాన్ రెడీ చేస్తున్నట్లుట్రాఫిక్ జాయింట్ సీపీ జోయెల్ డేవిస్ తెలిపారు. ఇకనుంచి ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సర్ప్రైజ్ డే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నట్లు- చెప్పారు. డ్రంక్ అండ్ డ్రైవ్ అంటే వీకెండ్స్ నైట్ మాత్రమే చేస్తారు అనే భావనలో ప్రజలు ఉన్నారు.. ఇక నుంచి డే-టైమ్ లో కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. జూన్ నెలలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో స్కూల్ బస్ డ్రైవర్ లు మద్యం సేవించి పట్టుబడటం ఆందోళన కలిగించిందని అన్నారు. 35 మంది స్కూల్ బస్ డ్రైవర్లు పట్టపగలు డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరకడం షాక్ కి గురి చేసిందని అన్నారు. బస్, వ్యాన్, ఆటో డ్రైవర్లు ఉదయం వేళలో మద్యం సేవించి వాహనాలు నడుపుతునట్లు- గుర్తించినట్లు చెప్పారు. ఉదయం వేళల్లో స్కూల్ బస్ డ్రైవర్లు, ఇతర వ్యాన్, ఆటో డ్రైవర్లు మద్యం సేవించి నడపటం వలన ప్రమాదాలు పెరుగుతున్నాయని.. ఇకనుంచి అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రుల్లోనే కాదు.. ఉదయం కూడా కొన్ని ఏరియాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేయాలని భావించినట్లు చెప్పారు. మైనర్ లు డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ చెప్పారు.మొత్తం 4500 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేసినట్లు-.. 2800 వాహనాల వెహికిల్ రిజిస్ట్రేషన్ క్యాన్సిల్ చేసేందుకు ట్రాన్స్ పోర్ట్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు- చెప్పారు.

# అవినీతి సొమ్ము గురించి మాట్లాడు

- కాళేశ్వరం అవినీతిపై చర్చించు
- పదేళ్ల దోపిడీపై ప్రజల్లో ప్రస్తావించు
- సిఎం రేవంత్‌పై విమర్శలు చేసే అధికారం నీకెక్కడిది
- కెటిఆర్ వ్యాఖ్యలపై ఎంపి కిరణ్ కుమార్ రెడ్డి ఫైర్

**న్యూఢిల్లీ, జూలై 16 :** విమర్శలు చేసే ముందు పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి, కాళేశ్వరం దుర్వినియోగంపై సమాధానం చెప్పాలని కెటిఆర్‌కు కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్రెడ్డి సవాల్ చేశారు. పదేళ్లపాటు అడ్డంగా రాష్ట్రాన్ని దోచుకుని, వాటిని కప్పిపుచ్చుకునేందుకు సిఎం రేవంత్‌పై బురద జల్లుతున్నారని మండిపడ్డారు. అసలు పదేళు అధికారంలో ఉండి, కృష్ణా, గోదావరి నదులపై ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతులు తెచ్చుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్న కేటీఆర్, ఈ రోజు సీఎం రేవంత్ రెడ్డి నిబద్ధత గురించి నోరు విప్పడం సిగ్గుచేటని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేటీఆర్ పాలనలో కట్టినా, అది కూలిపోయింది. ఈ ప్రాజెక్టు పేరిట హరిరామ్, నూనె శ్రీధర్, మురళీధరరావు వంటి ఇంజనీర్లు వందల కోట్ల రూపాయలు దోచుకున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఏసీబీ లెక్కలు తేల్చే పనిలో ఉంటే, కేటీఆర్‌కు సమాధానం చెప్పే దమ్ము లేదు. తన రక్తాన్ని రంగరించి కాళేశ్వరం కట్టానని చెప్పే కేసీఆర్ ఫ్యామిలీ దోపిడీ ఎంతో తెలంగాణ ప్రజల ఊహకే వదిలేస్తున్నామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై కెటిఆర్ చేసిన వ్యాఖ్యలకు దీటుగా కాంగ్రెస్ ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా తనదైన శైలిలో గట్టి కౌంటర్ ఇచ్చారు. నేను పెడితే పెళ్లి, ఇంకెవరు పెట్టినా పిండాకూడే అన్నాడట వెనకటికి అంటూ కేటీఆర్‌పై విరుచుకుపడ్డారు. ఈ సన్నాసి పదేళ్ల పాలనలో ఏం సాధించాడని ఈ రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిబద్ధతపై మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. కాళోజీ వంటి మహాకవి పేరు తీసుకునే అర్హత కేటీఆర్‌కు ఉందా? తన ఫాంహౌస్‌లు, ప్రగతి భవన్‌లు పది నెలల్లో కట్టుకుని కులికిన ఈ దుర్మార్గుడు, వరంగల్‌లో కాళోజీ కళాక్షేత్రాన్ని పదేళ్లు మొండి గోడలుగా వదిలేశాడు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాన్ని పూర్తి చేసింది. అయినా,



కాళోజీ పేరు తీసుకోవడానికి కేటీఆర్‌కు సిగ్గు అనిపించడం లేదా అని కిరణ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ సెంటిమెంట్‌తో దోచుకుని, పార్టీ పేరు మార్చుకుని, ప్రజలను ఏమార్చిన కేటీఆర్‌కు ఈ రోజు తెలంగాణ భావోద్వేగాలు పట్టవా? అధికారం కోల్పోయిన కసితో, రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు మధ్య అనుమానాలు సృష్టించి, తెలంగాణ ప్రజల మెదళ్లలో విషం నింపాలని చూస్తున్నాడు. కానీ, ఈ కుట్రలు ఫలించవని ఎంపీ అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ హక్కుల కోసం దేవుడితోనైనా కొట్లాడతానని రేవంత్ రెడ్డి గారు చేసిన ప్రతిజ్ఞ తెలంగాణ ప్రజల గుండెలను తాకింది. కానీ, తెలంగాణ భవిత కోసం దేవుడితోనే కాదు, కల్వకుంట్ల దెయ్యాలతో సైతం పోరాడాల్సిన అవసరం ఉందని ఈసారి గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలు ఈ కేటీఆర్ లాంటి అవకాశవాదుల కుట్రలను ఎప్పటికీ సాగనివ్వరని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ సన్నాసి కేటీఆర్‌కు చరిత్ర ఒక గుణపాఠం నేర్పిందని, తెలంగాణ ప్రజలను ఎవరూ మోసం చేయలేరని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# కదులుతున్న బస్సులో ప్రసవం

- పుట్టిన బిడ్డను విసరి పడేసిన యువతి
- డ్రైవర్ ఫిర్యాదుతో పోలీసుల అరెస్ట్

**ముంబయి, జూలై 16 :** కదులుతున్న బస్సులో ఓ యువతి ప్రసవించింది. అనంతరం పసికందును బస్సు కిటికీలో నుంచి బయటకు విసిరేయడంతో బాబు చనిపోయాడు. ఈ సంఘటన మహారాష్ట్రలోని పర్భాణీ ప్రాంతంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రితిక దీరీ అనే యువతి, అల్తాఫ్ షేక్‌తో కలిసి పూణే నుంచి పర్భాణీకి వెళ్తోంది. సంత్ ప్రయాగ్ ట్రావెల్స్‌లో స్లీపర్ కోచ్‌లో ఇద్దరు ప్రయాణిస్తున్నారు. పెత్రి-సెలూ రహదారిపై రాగానే రితికకు పురటి నొప్పులు రావడంతో పండంటి మగ బిడ్డకు జన్మనించింది. వెంటనే బాబును గుడ్డలో మూటకట్టి బస్సులో కిటికీలో నుంచి షేక్ బయటపడేశాడు. డ్రైవర్ గమనించి కిటికీలో నుంచి వస్తువు బయటపడడంతో బస్సును నిలిపివేశాడు. డ్రైవర్‌ను వారిని ప్రశ్నించగా తన భార్య రితిక వాంతులు చేసుకోవడంతో గుడ్డతో సహా బయటపడేశానని వివరణ ఇచ్చాడు. డ్రైవర్‌కు అనుమానం రావడంతో రోడ్డు వెంట పరిశీలించగా పసికందు దేహం కనిపించింది. వెంటనే డ్రైవర్ 112కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు అక్కడికి చేరుకొని ఇద్దరు అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. ఇద్దరు భార్యభర్తలమని సమాధానం చెప్పారు. దంపతులమని చెప్పడానికి సరైన ఆధారాలు వారి వద్ద లేవు. ఏడాదిన్నర నుంచి పుణేలో కలిసి ఉంటు-న్నామని పోలీసులకు ఇద్దరు వివరణ ఇచ్చారు. యువతిని ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బిఎన్ఎస్ సెక్షన్ల కింద 94(3)(5) కింద కేసు నమోదు చేసి పోలీసుల దర్యాప్తు చేస్తున్నారు. పసికందు మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.



## బనకచర్లపై చర్చ జరగలేదని అంటారా ?

**సిఎం రేవంత్ వ్యాఖ్యలపై హరీష్ రావు మండిపాటు**

**హైదరాబాద్, జూలై 16 :** తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీలో మొదటి అంశమే బనకచర్ల అని భారత రాష్ట్ర సమితి నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కానీ.. బనకచర్ల ప్రస్తావనే రాలేదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని.. ఆయన మాటలు, చేతలకు పొంతన ఉండదని విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్టు, ఇతర అంశాల పరిష్కారానికే కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారని హరీష్ చెప్పారు. రాష్ట్రంలో భాజపా, తెదేపా రిమోట్ పాలన కొనసాగుతోంది. కమిటీ నిర్ణయాన్ని అంగీకరిస్తామని సీఎం రేవంత్ చెప్పడం సబబు కాదన్నారు. బనకచర్లపై కేంద్రం భేటీయే తప్పు.. సీఎం పాల్గొనడం మరో తప్పు. 4 కేంద్ర సంస్థలు తిరస్కరించిన ప్రతిపాదనపై సమావేశం ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. రాష్ట్రానికి ద్రోహం చేస్తూ సీఎం మరణశాసనం రాశారు. బేషరతుగా ఆయన క్షమాపణ చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## ఏసీబీ వలలో పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్

**లంచం తీసుకుంటుండగా కనకరత్నం పట్టివేత**

**హైదరాబాద్, జూలై 16 :** తెలంగాణ పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ కనకరత్నం ఏసీబీ వలలో చిక్కారు. డీఈ బదిలీ విషయంలో ఆయన రూ. 50వేలు డిమాండ్ చేశారు. లంచం డబ్బు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ ఏడాది మార్చి 31న కనకరత్నం పదవీవిరమణ పొందారు. అయితే, ప్రభుత్వం ఆయన పదవీకాలాన్ని మరో ఏడాదిపాటు- పొడిగిచింది. కాగా సొంత శాఖలోని డీఈ తాండూరు నుంచి వికారాబాద్‌కు బదిలీ చేయాలని కోరగా.. కనకరత్నం రూ. 50వేలు లంచం అడిగారు. దీంతో డీఈ ఏసీబీని ఆశ్రయించారు. దీంతో కనకరత్నం లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పంచాయతీ రాజ్ కార్యాలయంతోపాటు కేపీహెచ్‌బీ కాలనీలోని ఆయన నివాసంలోనూ సోదాలు నిర్వహించారు. భారీగా నగదు, ఆస్తులు గుర్తించినట్లు తెలుస్తోంది. అనంతరం కనకరత్నంను అరెస్టు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ వెల్లడించారు.

## త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్

- రాష్ట్రంలో మొత్తం 31 జడ్పీ స్థానాలు
- 566 ఎంపీపీ, జడ్పీటీసీ, 5,773 ఎంపీటీసీ స్థానాలు

**హైదరాబాద్, జూలై 16 :** త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడనున్న నేపథ్యంలో ప్రభుత్వం జడ్పీటీ-సీ, ఎంపీపీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ స్థానాలను ఖరారు చేస్తూ ప్రకటన చేసింది .జడ్పీటీసీ, ఎంపీటీ-సీ స్థానాలను తెలంగాణ ప్రభుత్వం ఖరారు చేసింది. రాష్ట్రంలో మొత్తం 31 జడ్పీ స్థానాలు, 566 ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు.. 5,773 ఎంపీటీసీ స్థానాలు ఉన్నట్లు తెలిపింది. 12,778 గ్రామ పంచాయతీలు, 1.12 లక్షల వార్డులు ఉన్నట్లు- పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం పంచాయతీ రాజ్ శాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పరిషత్ టెరిటోరియల్ కాన్‌స్టిట్యూఎన్సీలు, మండల పరిషత్ టెరిటోరియల్ కాన్‌స్టిట్యూన్సీ స్థానాల సంఖ్యను ఖరారు చేసింది. మొత్తం 566 జడ్పీటీసీ, మండల ప్రజా పరిషత్ స్థానాలు, అలాగే 5,773 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల కు మార్గం సుగమం చేసిందని చెప్పవచ్చు. ఈ స్థానాలు ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో ఉన్నాయి. అయితే, ఈసారి జడ్పీటీ-సీ, ఎంపీపీ స్థానాల సంఖ్య 539 నుంచి 566కి పెరిగింది. ఇది 31 జిల్లా పరిషత్‌ల లో నిర్వహించబడుతుంది. ఎంపీటీసీ స్థానాల సంఖ్య కూడా 5,817 నుంచి 5,773కి కొద్దిగా తగ్గింది. ఈ ఎన్నికలను ఆగస్టులో జడ్పీటీ-సీ, ఎంపీటీ-సీ స్థానాలకు, సెప్టెంబరులో గ్రామ పంచాయతీలకు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 రిజర్వేషన్‌ను అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం రాష్ట్ర జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడానికి తీసుకున్న చర్యగా చెప్పవచ్చు. ఈ రిజర్వేషన్ విధానం కింద గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండల యూనిట్లుగా, ఎంపీపీలు, జడ్పీటీ-సీలు జిల్లా యూనిట్లుగా, జడ్పీ చైర్పర్సన్‌లు రాష్ట్ర యూనిట్‌గా పరిగణించబడతాయి. ప్రభుత్వం ఈ రిజర్వేషన్‌ను అమలు చేయడానికి ఒక ఆర్డినెన్స్ జారీ చేయనుంది. దీనిని రాష్ట్ర గవర్నర్‌కు పంపించారు. ఈ ఆర్డినెన్స్ చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉన్నందున, ప్రభుత్వం హైకోర్టు, సుప్రీంకోర్టులో కేవియట్‌లను దాఖలు చేయడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ ఎన్నికలు రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలకు కీలక పోటీ-గా ఉంటాయి. ఈ ఎన్నికల ద్వారా కాంగ్రెస్ పార్టీ గ్రామీణ స్థాయిలో తమ పట్టును బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

# మహిళలకు స్వయం ఉపాధి పథకాలు

- కోటిమందిని కోటీశ్వరులు చేసే బాధ్యత
- పెద్దపల్లిలో వీ హబ్ ఏర్పాటుకు కృషి
- ఇందిరాశక్తి సంబరాల సభలో మంత్రి శ్రీధర్ బాబు



**పెద్దపల్లి, జూలై 16 :** మహిళలకు ఉపాధి కల్పించే కార్యక్రమాలు చేపట్టామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. మహిళలను కోటీశ్వరులు చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. వారికి అన్ని విధాలుగా అండగా ఉండేలా కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. పెద్దపల్లిలో ఏర్పాటు-చేసిన ఇందిరాశక్తి సంబరాల సభకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, ఎమ్మెల్యే విజయరమణరావుతో కలిసి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని ఈ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. పెద్దపల్లి జిల్లాలో మహిళా సంఘాల నుంచి 9 బస్సులను ఆర్టీసీలో అద్దెకు తీసుకున్నాం. గతంలో కొందరు పెద్దమనుషుల నుంచే ఆర్టీసీ బస్సులు అద్దెకు తీసుకునేవారు. విద్యార్థుల యూనిఫాంలు కుట్టే పనులను మహిళా సంఘాలకే అప్పగించాం. సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు-, రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే అవకాశం కూడా మహిళలకే ఇచ్చాం. పెద్దపల్లిలో వీ హబ్ ఏర్పాటు-చేస్తాం. మాజీ సీఎం కేసీఆర్ ఆంధ్ర ప్రాంతానికి నీళ్లు ఇవ్వడం గురించి మాత్రమే ఆలోచించారు. రాష్ట్ర జలహక్కుల విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ మేం రాజీపడేది లేదని శ్రీధర్‌బాబు అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఆడబిడ్డలు ఆశీర్వదిస్తేనే ఇల్లు అయినా, ప్రభుత్వం అయినా చల్లగా ఉంటు-ందన్నారు. ప్రభుత్వం ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం. ఏ వ్యాపారమైన మహిళలకే ఇవ్వాలని మంత్రి సీతక్క చెప్పారు. ఇల్లు ఇచ్చినా, రేషన్ కార్డు ఇచ్చినా మహిళల పేరు మీదే ఇవ్వాలంటు-న్నారు. రుణమాఫీ కింద రైతుల ఖాతాల్లో ఒకేసారి రూ. 21వేల కోట్లు- వేశాం. రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో 9 రోజుల్లోనే రూ. 9వేల కోట్లు వేశాం. తక్కువ ఇబ్బందులు, ఎక్కువ ఆదాయం వచ్చే పంటలను రైతులు ఎంచుకోవాలని సూచించారు. బీజేపీపై మంత్రి సీతక్క హాట్ కామెంట్స్ చేశారు. తాము బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు తీసుకొస్తుంటే బీజేపీ జీర్ణించుకోలేకపోతోందన్నారు. బీసీల రిజర్వేషన్లకు బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకమే అని ఫైర్ అయ్యారు. బీసీల సాధికారత కోసం కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో బీసీలకు రిజర్వేషన్లు రావాలన్నారు మంత్రి సీతక్క. ఈ సందర్భంగా తన శాఖ పరిధిలోని అంశాలపై, ఇతర ప్రభుత్వ పథకాలపై మాట్లాడారు. బడి పిల్లల యూనిఫార్మ్ ల ద్వారా మహిళ సంఘాలకు 30 కోట్లు- ఆదాయం వచ్చిందని తెలిపారు సీతక్క. తమ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమే కాకుండా ఆ బస్సులకు ఓనర్లను కూడా చేస్తోందన్నారు. అంబానీ లాంటి కోటీశ్వర్లు నడిపే సోలార్ ప్లాంట్లు- కూడా మహిళ సంఘాలకు ఇస్తున్నామని వివరించారు.

# సవాళ్లు విసరడం... పారిపోవడం రేవంత్ నైజం

- ఇలాంటి వారు పదవుల్లోకి వస్తారని అంబేద్కర్ ఊహించలేదు
- దళిత బంధు సాధనసమితి సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్



**హైదరాబాద్, జూలై 16 :** చర్చలకు రమ్మని సవాళ్లు విసరడం.. పారిపోవడం రేవంత్‌కు అలవాటు అయ్యిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ రాజకీయాల్లో ప్రతిపక్ష, అధికార పార్టీల నడుమ సవాళ్ల పర్వం కొనసాగుతోంది. మరోసారి సీఎం రేవంత్ రెడ్డిపైకేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈరోజు తెలంగాణ భవన్‌లో జరిగిన దళిత బంధు సాధనసమితి సమావేశంలో రేవంత్ పై సంచలన వ్యాఖ్యలు చేశారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం రాసినప్పుడు రేవంత్ రెడ్డి లాంటి దొంగలు, లంగలు పదవుల్లోకి వస్తారని ఊహించలేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అందుకే ఐదు సంవత్సరాల పాటు- పదవిలో ఉండే విధంగా రాజ్యాంగం రాశారని అన్నారు. లేకుంటే దేశంలో రేవంత్ లాంటి మోసాగాళ్లను రీకాల్ చేసే వ్యవస్థను కూడా ప్రవేశపెట్టేవారని అన్నారు. రేవంత్‌కు దమ్ముంటే.. కూలిందంటున్న మేడిగడ్డ బ్యారేజి మీదనే చర్చ పెడదాం అని.. చర్చకు.. రా అని సవాలు విసిరి చర్చకు వెళితే రేవంత్ రెడ్డి పారిపోయిండని చురకలు అంటించారు. చర్చకు వస్తవా అని పిలిచి పారిపోయిన పిరికి సన్నాసి రేవంత్ రెడ్డి అని సెటైర్లు వేశారు. మరొకసారి నాగార్జునసాగర్ కట్టపైన చర్చకు వస్తావా అని సవాల్ విసిరిండని.. రేవంత్ రెడ్డికి తెలివిలేక కాళేశ్వరాన్ని కులేశ్వరం అంటు-న్నారని ఫైరయ్యారు. నాగార్జునసాగర్ కట్టమీద కాదు.. కానీ మేడిగడ్డ బ్యారేజ్ మీద చర్చకు రావాలని సవాలు విసిరారు. తుంగతుర్తి సూర్యాపేట నియోజకవర్గం చివరి మడి వరకు నిలిచిన నాయకుడు కేసీఆర్ అన్న సంగతి రేవంత్‌కు తెలుసునని కేటీ-ఆర్ అన్నారు. ముఖ్యమంత్రి దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని కేటీ-ఆర్ ఫైరయ్యారు. ఇచ్చిన హామీలు అమలు చేయమంటే.. సీఎం రంకెలు వేస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఏం పీక్కుంటారో పీక్కోండని సీఎం పదేపదే అంటున్నారని.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఏం పీక్కుంటారో చూపిస్తారని కేటీఆర్ చురకలంటించారు. రాజకీయాల్లో తిట్లు- వాడడం తమకు ఇష్టం లేదని చెప్పారు. కానీ రేవంత్ రెడ్డికి ఆయన భాషలో చెప్తేనే అర్థమవుతుందని మాట్లాడాల్సి వస్తుందని.. కుక్క కాటుకు చెప్పు దెబ్బ అన్నట్లు మేము కూడా తిట్లు వాడక తప్పడం లేదని వ్యాఖ్యలు చేశారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల గోల్‌మాల్

**నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు**

**హైదరాబాద్, జూలై 16 :** తెలంగాణ సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల గోల్‌మాల్ వ్యవ హారంలో జూబ్లీహిల్స్ పోలీసులు తాజా గా నలుగురిని అరెస్టు చేశారు. జోగుల నరేష్, వెంకటేశ్, వంశీ, ఓంకార్‌లను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. ప్రభుత్వం మారిన తర్వాత ఎవరూ సంప్రదించని 19 చెక్కుల సొమ్మును వీరు కాజేశారు. ఫోర్జరీ పత్రాలతో వ్యక్తిగత ఖాతాలకు మళ్లించుకున్నారు. నిందితుల్లో ఒకరైన జోగుల నరేశ్ మాజీ మంత్రి పేషీలో పని చేసినట్లు తెలుస్తోంది. లబ్ధిదారులకు చెందాల్సిన వీటిని వీరు తమ ఖాతాల్లోకి మళ్లించారు.

## 10లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం

**ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో సిఎం చంద్రబాబు**

**న్యూఢిల్లీ, జూలై 16 :** ఏపీలో తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏడాదిలో 10లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని సీఎం చంద్రబాబు తెలిపారు. వచ్చే ఏడాది 13 లక్షల కోట్ల పెట్టుబడులు లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. 'స్వర్ణాంధ్రప్రదేశ్-2047'పై టాటా సంస్థల ఛైర్మన్ చంద్రశేఖరన్ నేతృత్వంలో ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ తమ నివేదికను సీఎంకు దిల్లీలో అందజేసింది. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధికి నివేదికలో టాస్క్‌ఫోర్స్ పలు సూచనలు చేసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. ప్రస్తుతం కాలంలో సాంకేతికత అనేది గేమ్ ఛేంజర్. ఈ సాంకేతిక యుగంలో ప్రభుత్వాల వద్ద ప్రజల డేటా ఉంటు-ంది. రాష్ట్రంలో ఆగస్టు 15 నుంచి వాట్సప్‌లో మరిన్ని పౌర సేవలు అందుబాటులో వస్తాయి. కుప్పం నుంచి డిజిటల్ హెల్త్ కార్డుల కార్యక్రమం చేపడతాం. ఏపీలో చాలా అవకాశాలు ఉన్నాయి. విశాఖ, విజయవాడ, తిరుపతి వ్యాపారానికి అనుకూల నగరాలు. విశాఖకు గూగుల్ రాబోతోంది. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం పీ-4 పాలసీ తీసుకొచ్చాం' అని చంద్రబాబు వివరించారు.

# పహల్గామ్ దాడిలో సంచలన విషయాలు

**హంతక మూఠా సంతోషంతో గాల్లోకి నాలుగు రౌండ్లు కాల్పులు**



**శ్రీనగర్, జూలై 16 :** పహల్గామ్ ఉగ్ర దాడి యావత్తు దేశాన్ని కాకుండా ప్రపంచాన్ని కలవరపాటుకు చేసింది. నలుగురు ముష్కరులు తుపాకులతో చెలరేగిపోయారు. మహిళలు, పిల్లల్ని వదిలేసి భర్తలను చంపేశారు. ఇలా 26 మందిని ఉగ్రవాదులు పొట్టనపెట్టుకున్నారు. ఇక ఈ కేసును ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోంది. దర్యాప్తులో భాగంగా ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన స్థానికులను అరెస్ట్ చేశారు. అలాగే సంఘటనాస్థలిలో ఉన్న ప్రత్యక్ష సాక్ష్యులను అధికారులు విచారించారు. అయితే పహల్గామ్‌లో ఉగ్రవాదులు తమ పని పూర్తి చేశాక.. సంతోషంతో గాల్లోకి నాలుగు రౌండ్లు కాల్పులు జరిపారని ప్రత్యక్ష సాక్షి ఒకరు అధికారులకు వెల్లడించాడు. ఆ దృశ్యాలను ప్రత్యక్షంగా చూసినట్లుగా పేర్కొన్నాడు. ఇక ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. బాట్కోట్ నుంచి పర్వైజ్ అహ్మద్ జోథర్, హిల్ పార్కు నుంచి బషీర్ అహ్మద్ జోథర్‌గా గుర్తించారు. బాట్కోట్, హిల్ పార్క్ రెండు ప్రాంతాలు కూడా పహల్గామ్‌లోనే ఉన్నాయి. విచారణలో ముగ్గురు ఉగ్రవాదుల వివరాలను వెల్లడించారు. ఉగ్రవాదులు... లష్కరే తోయిబాతో అనుబంధంగా ఉన్న పాకిస్థాన్ పౌరులుగా నిర్ధారించారు. హిల్ పార్కులోని ఒక గుడిసెలో ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించారు. ఆహారం, లాజిస్టికల్ మద్దతు అందించారు. ఇక పర్వైజ్, బషీర్‌ను చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివార) చట్టం, 1967లోని సెక్షన్ 19 కింద అరెస్టు చేశారు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని దర్యాప్తు అధికారి మీడియాకు తెలిపారు. ఇక ప్రత్యక్ష సాక్షి దర్యాప్తు సంస్థతో కీలక విషయాలు పంచుకున్నాడు. 26 మందిని చంపిన తర్వాత ముగ్గురు ఉగ్రవాదులు వెళ్లిపోతుండగా తనను ఆపారని చెప్పాడు. కల్మా పఠించమని అడిగారని.. తాను స్థానిక యాసలో మాట్లాడడంతో తనను విడిచిపెట్టేశారని పేర్కొన్నాడు. అనంతరం సంతోషంగా నాలుగు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారని చెప్పుకొచ్చాడు. ఇక పర్వైజ్, బషీర్ కొండ దగ్గర నిలబడి.. ఉగ్రవాదుల వస్తువులను చూసుకున్నారని వెల్లడించాడు. కాల్పులు అయిపోయాక.. ముష్కరులు వస్తువులు తీసుకుని వెళ్లిపోయారని పేర్కొన్నాడు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో పర్యాటకుల్ని లక్ష్యంగా చేసుకుని ముష్కరులు దాడి చేశారు. మతం ఆధారంగా దాడి చేశారు. ముస్లిం వ్యతిరేకులను 26 మందిని చంపేశారు. అయితే ఈ దాడిలో నలుగురు ఉగ్రవాదులు పాల్గొన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

# రాజకీయ అవకాశం దక్కని కులాలకు పదవులు

- 42శాతం రిజర్వేషన్లలో ఆయా కులాలకు పెద్దపీట
- 25వేల మంది బిసిలకు పదవులు దక్కే వరకు పోరాటం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత



**హైదరాబాద్, జూలై 16 :** 25వేల మంది బీసీలు ప్రజాప్రతినిధులు అయ్యే వరకు తెలంగాణ జాగృతి పోరాటం చేస్తుందని తెలం గాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. 25వేల పదవుల్లో సగం మంది మన ఆడబిడ్డ లకే అవకాశం దక్కుతుం దని అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తే ఇప్పటివరకు రాజకీ య అవకాశాలు దక్కని కులాలకు సబ్ కోటా కల్పించాలని డిమాండ్ చేశారు. బుధవారం తన నివాసంలో యూపీఎఫ్ నాయకులు, 72కులాల ప్రతినిధులతో ఎమ్మెల్సీ కవిత సమావేశం అయ్యారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. సర్పంచులు, ఎంపీపీలుగా ఇప్పటి వరకు రాజకీయ అవకాశాలు దక్కని ఎన్నో కులాలు బీసీలలో ఉన్నాయని ఆమె గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచడం ఎంత ముఖ్యమో.. రాజకీయ అవకాశాలు దక్కని వారికి పదవులు దక్కేలా సబ్ కోటా ఇవ్వడమూ అంతే ముఖ్యమని ఆమె అభిప్రాయపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటే రాజ్యాంగ సవరణ చేయాలని అన్నారు. అది కేంద్రం పరిధిలో ఉంటుందని, రాష్ట్ర అసెంబ్లీ, కౌన్సిల్ పాస్ చేసిన బిల్లులు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ కేబినెట్ చేసిన సవరణ తీర్మానం గవర్నర్ వద్ద పెండింగ్ లో ఉందని వ్యాఖ్యానించారు. గవర్నర్ కేబినెట్ ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసి గెజిట్ జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. గవర్నర్ ఆర్డినెన్స్ ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం కేవియట్ వేయకుంటే ఎవరైనా కోర్టుకు వెళ్లి రిజర్వేషన్లకు అడ్డు తగిలే ప్రమాదం ఉందన్నారు. ఆ అవకాశం ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రిజర్వేషన్లను పెంచుతూ చట్ట సవరణ చేసే అధికారం కేంద్రం పరిధిలో ఉంటే.. ఉన్న రిజర్వేషన్లలో సబ్ కేటగరైజేషన్ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిదే అని అన్నారు. రాజకీయ అవకాశాలు దక్కని కులాల నుంచి సర్పంచులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్ లు కావాలంటే సబ్ కేటగరైజేషన్ ఒక్కటే మార్గం అని చెప్పారు.

## ప్రభంజన్ మృతికి కెసిఆర్ సంతాపం



**హైదరాబాద్, జూలై 16 :** తెలంగాణ ఉద్యమకారుడు, బహుజన మేధావి, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ మరణం పట్ల.. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో జర్నలిస్టు మేధావిగా, యాక్టివిస్ట్‌గా ప్రభంజన్ యాదవ్ చేసిన కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. ఢిల్లీలో తాను చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రభంజన్ యాదవ్ ఉద్యమ నిబద్ధత గొప్పదని కేసీఆర్ అన్నారు. మహాత్మా ఫూలే, అంబేద్కర్ సామాజిక తాత్విక ఆలోచనా దృక్పథంతో, బీసీ కులాల హక్కులు, పురోగతి కోసం నిత్యం తపించే ప్రభంజన్ యాదవ్ మరణంతో తెలంగాణ ఒక గొప్ప తాత్వికున్ని, సామాజిక ఉద్యమకారున్ని కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. శోక తప్తులైన వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రభంజన్ మృతికి కెటిఆర్, హరీష్ రావు, కవిత తదితరులు కూడా సంతాపం తెలిపారు.



## తిరుమలలో ఘనంగా ఆణివార ఆస్థానం

**సర్వభూపాల వాహనంపై మలయప్పస్వామి వేంచేపు**

**తిరుమల, జూలై 16 :** తిరుమలలో ఆణివార ఆస్థానం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మలయప్పస్వామి వారు ఉభయదేవేరులతో సర్వభూపాల వాహనంపై వేంచేశారు. మరో పల్లకిలో సర్వ సైన్యాధ్యక్షుడు విష్వక్సేనులు దక్షిణ అభిముఖంగా వేంచేశారు. ఉత్సవ మూర్తులతో పాటు- మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. జీయర్లు ఊరేగింపుగా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. సాయంత్రం పుష్పపల్లకి వాహనంపై మలయప్పస్వామి ఊరేగనున్నారు. సాధారణంగా ప్రతి సంవత్సరం సౌరమానం ప్రకారం దక్షిణాయన పుణ్యకాలంలో కర్కాటక సంక్రాంతినాడు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. సౌరమానాన్ని అనుసరించే తమిళుల కాలమానం ప్రకారం ఆణిమాసం చివరి రోజున నిర్వహించే కొలువు కావడంతో ఆణివార ఆస్థానం అని పేరు. పూర్వం ఈ ఆణివార ఆస్థానం పర్వదినంనాటి నుంచి తితిదే వారి ఆదాయ వ్యయాలు, నిల్వలు తదితర వార్షిక లెక్కలు ప్రారంభమయ్యేవి. తితిదే ధర్మకర్తల మండలి ఏర్పడిన తరువాత వార్షిక బడ్జెట్‌ను మార్చి-ఏప్రిల్ నెలలకు మార్చారు. ఇకపోతే తిరుమల శ్రీవారి ఆలయంలో సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచి, శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. ఆ తరువాత స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం ప్రారంభించారు. సంవత్సరంలో నాలుగుసార్లు అనగా ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆనందనిలయం మొదలు కొని బంగారు వాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రిలను నీటితో శుభ్రంచేశారు

## సంపాదకీయం

# చంద్రబాబుకు తలొగ్గుతున్న కేంద్రం !



దొడ్డిదారిన దోపిడీచేయాలి. ఏదో రకంగా డబ్బులు వెనకేసుకోవడం రాజకీయ నాయకులకు అలవాటుగా మారింది. ముఖ్యంగా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల పాలకులు అడ్డగోలు దోపిడీకి పాల్పడుతున్నా.. కేంద్రం చోద్యం చూస్తోంది. ఎన్‌డిఏలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబుకు ఇప్పుడు బిజెపి వంతపాడుతోంది. ఆయన తానా అంటే..కేంద్రం తందానా అంటోంది. కారణం..బాబు ఎంపిల మద్దతుతో ఎన్డిఎ ప్రభుత్వం కొనసాగడమే. చాపకింద నీరులా చంద్రబాబు కూడా తనకు అనుకూలంగా ఉన్న పనులను మెల్లగా కానిచ్చే స్తున్నారు. మోడీ, అమిత్ షాలు కూడా బాబు పురమాయిస్తున్న పనులకు తలూపుతున్నారు. విశాఖ ఉక్కుకు నిధులు కేటాయించారు. పోలవరంకు నిధులు ఇచ్చారు. అమరావతికి నిధులు మంజూరు చేశారు. విశాఖలో యోగా డేను పెట్టి ప్రధానిని రప్పించారు. కేంద్రమంత్రులు ఎపికి వచ్చి వాలుతున్నారు. బాబుతో సంప్రదిం పులు చేస్తున్నారు. అశోకగజపతిని గవర్నర్‌ను చేశారు. ఇందులో కొన్ని రాష్ట్ర ప్రయోజనాలకు ఉద్దేశించి నవే. అమరావతిలో ఇప్పటికే 35వేల ఎకరాలు సేకరించినా, అది సరిపోదంటూ..మరింత భూమికి బాబు ఎసరు పెట్టారు. మరో 40వేల ఎకరాల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. విభజన తరవాత తొలి ఐదేళ్ల కాలంలో అమరావతిని పూర్తి చేయలేదు. పోలవరంను పట్టాలకెక్కించలేదు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయలేదు. ఇప్పటికీ వారు కూడు,గూడు కోసం అల్లాడుతున్నా పట్టించుకోవడం లేదు. పోలవరం ఇప్పటికీ పూర్తి కాలేదు. ఎపిలో కలుపుకున్న ఐదు మండలాల సంగతి మాట్లాడడం లేదు. భద్రాచలం ఇవోపై దాడి చేసినా కిమ్మనడం లేదు. పోలవరం ఇంకా పూర్తికాకముందే పోలవరం–బనకచర్ల లింకు ప్రాజెక్టుపై చంద్రబాబు హడావిడి చేస్తుండడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. నీటి సమస్యలపై ఏనాడూ చర్చలకు పిలవని కేంద్రం చంద్రబాబు చెప్పగానే బనకచర్లపై మాట్లాడుకుందాం రా.. అంటూ తెలంగాణ సిఎంకు కూడా కబురు పెట్టారు. అసలు నీటి సమస్యలు పక్కకు పోయాయి. కొత్తగా బనకచర్లపై కేంద్రం కూడా గంగిరెద్దులా తలూపుతోంది. అసలు ఈ ప్రాజెక్టు సాధ్యమా కాదా అన్న కోణంలో ఎవ్వరూ ఆలోచించడం లేదు. ఆలోచిస్తే ఎక్కడ తమ పీఠాలు కదులుతాయో అని బిజెపి నేతలు భయంతో ఉన్నారు. తెలంగాణ ప్రాజెక్టులపై మాత్రం మాట్లాడడం లేదు. కాళేశ్వరం అక్రమాలపై మాట్లాడిన వారు చర్యలు తీసుకోవడం లేదు. అసలు చంద్రబాబు చేస్తున్న హడావిడి అంతా చూస్తుంటే బనకచర్ల మరో కాళేశ్వరంగా మారడం ఖాయమని చెప్పవచ్చు. కేవలం డబ్బుల కోసమే ఈ ప్రాజెక్టుపై తెగ ప్రచారం చేస్తున్నారని చెప్పవచ్చు.

ఎందుకంటే ఇప్పటికే రూ.10 లక్షల కోట్ల అప్పులపాలైన ఏపీ సర్కారు, బనకచర్ల కోసం మరో రూ. 82వేల కోట్ల అప్పు చేసేందుకు ఎందుకు తెగిస్తోందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అసలు అక్కడ వరద జలాలే లేవని కేంద్ర సంస్థలు చెబుతున్నా.. ఈ ప్రాజెక్ట్ మరో కాళేశ్వరంలా మారి, ఏపీ పాలిట తెల్ల ఏనుగు అవుతుందని అక్కడి ఇరిగేషన్ నిపుణులు, మేధావులు హెచ్చరిస్తున్నా చందరబాబు మాత్రం ఎక్కిడికి వెళ్లినా బనకచర్ల అంటూ తీవ్రంగా ప్రచారం చేస్తున్నారు. మిగులు జలాలు అంటూ పలవరిస్తున్నారు. దీని వెనుక అసలు కారణం వేరే ఉందనే వాదన వినిపిస్తున్నది. గతంలో తెలంగాణలో కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి లాంటి కీలక ప్రాజెక్టులతో పాటు అటు–ఏపీలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ లాంటి భారీ ఇరిగేషన్ ప్రాజెక్టులు చేపట్టి లక్షల కోట్లు సంపాదించిన ఓ బడా కాంట్రాక్ట్ సంస్థే.. ఇప్పుడు ఈ బనకచర్ల ప్రాజెక్టునూ చేపట్టేందుకు ముందుకు వచ్చినట్లు తెలిసింది. అవసరమైతే తెలంగాణ ప్రభుత్వాన్ని ఒప్పిస్తానని ఆ కాంట్రాక్ట్ సంస్థ ఆఫర్ ఇచ్చినట్లు అక్కడి అధికార, రాజకీయ, మేధావి వర్గాల్లో చర్చ జరుగుతున్నది. మొత్తమ్మీద 40,500 ఎకరాల వ్యవసాయ భూములు, 17 వేల ఎకరాల అటవీ భూములు సేకరించి, 18 గ్రామాలను ముంచి, 10 లిఫ్టులు పెట్టి, నెలనెలా కరెంట్‌కు వేల కోట్లు– ఖర్చు పెడ్తూ 575 కిలోమీటర్లకు గోదావరి నీళ్లు ఎత్తిపోయడం అసాధ్యమని వేరుగా చెప్పనక్కరలేదు. ఎందుకంటే కాళేశ్వరంలో ఇలాగే జరిగింది. మహాద్భుత కట్టడంగా ఆనాడు కెసిఆర్ ప్రచారం చేసి లక్షకోట్లు తగలేశారు. గోడకేసిన సున్నంలా చేశారు. కేవలం తమవారి, తన పొలాలు పారించుకునేలా కాళేశ్వరం డిజైన్ చేసుకున్నారు. ఈ విమర్శలపై ఆరోపణలు వచ్చినా పెద్దగా విచారణ సాగడం లేదు.

కాళేశ్వరంలో ఎవరు ఎంత తిన్నారో కానీ అధికారులు మాత్రం కోట్లకు పడగ లెత్తారు. ఇందులో భాగస్వాములు అయిన అధికారులు ఎసిబికి చిక్కి కేసులు ఎదుర్కొంటున్నారు. ఊచలు లెక్క పెడుతున్నారు. ఇకపోతే బనకచర్ల పేరుతో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ చేసి, శ్రీశైలం నుంచి కృష్ణా నీటిని మళ్లించే ఎత్తుగడ కూడా ఇందులో దాగివుందని స్పష్టమవుతున్నది. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టులో కెసిఆర్ అవలంబించిన విధానాలనే బనకచర్ల ప్రాజెక్టు విషయంలో చంద్రబాబు ఫాలో అవుతున్నారని అనిపిస్తోంది. 10 లిఫ్టులు, 38 కిలోమీటర్ల పొడవైన సొరంగాల ద్వారా 575 కిలోమీటర్ల దూరంలో ఉన్న బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు గోదావరి నీళ్లను తరలించేలా పీబీ లింక్ ప్రాజెక్టును రూ.82 వేల కోట్లతో నిర్మించాలని ఏపీ నిర్ణయించింది. ఇది అంచనా మాత్రమే. ప్రాజెక్టు పూర్తయ్యే సరికి మొత్తం ఖర్చు రూ.లక్ష కోట్లు– దాటనుంది. ఈ క్రమంలో ఇప్పటికే పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు నీళ్లను తరలించే సెగ్మెంట్ పనులకు టెండర్లను పిలిచేందుకు ఏపీ సర్కారు రెడీ అవుతోంది. పనిలో పనిగా సెగ్మెంట్ పనులను సైతం సమాంతరంగా చేసే అంశంపైనా కసరత్తు చేస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో కీలక పనులు దక్కించుకున్న ఓ బడా కాంట్రాక్ట్ సంస్థే బనకచర్ల మెయిన్ వర్క్స్ చేపట్టేందుకు ముందుకు వచ్చి నట్లు తెలిసింది.దాదాపు రూ.50 వేల కోట్ల పనులను అప్పనంగా పంచే ప్రయత్నాలు జరుగుతున్నాయనే చర్చ ఏపీ అధికార, రాజకీయ, మేధావి వర్గాల్లో జరుగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో దాదాపు 56 సబ్ కాంట్రాక్ట్ పనులను ఆనాటి బీఆర్ఎస్ సర్కారు ఇచ్చిందని కాళేశ్వరం కమిషన్ విచారణలో ఇప్పటికే తేలింది. ఇప్పుడు బనకచర్ల ప్రాజెక్ట్ విషయంలోనూ అదే రీతిలో సబ్ కాంట్రాక్టుల దందాకు తెరలేపు తున్నట్టు తెలుస్తోంది. లక్షల కోట్లతో బనకచర్ల ప్రాజెక్టు నిర్మించినా ప్రయోజనం ఉండదని మేధావులు సైతు అంగీకరిస్తున్నారు. పోలవరం పూర్తయితే తప్ప నీటి చుక్క కూడా తరలించే పరిస్థితి లేనప్పటికీ చంద్రబాబు మాత్రం బనకచర్ల ద్వారా రాయలసీమను సస్యశ్యామలం చేస్తానని చెప్పడంపై ఏపీలో ఇరిగేషన్ నిపుణులు, మేధావులు, ఆర్థికవేత్తల నుంచి విస్మయం వ్యక్తమవుతోంది. ఈ క్రమం లోనే బనకచర్లకు వ్యతిరేకంగా విజయవాడ కేంద్రంగా ఇటీవల ఆలోచనాపరుల వేదిక పురుడుపోసుకుంది. ఈ మేరకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వేదిక బాధ్యులు మాజీ డీజీపీ ఏబీ వెంకటేశ్వర్రావు, కంభంపాటి పాపారావు, అక్కినేని భవాని ప్రసాద్, టి.లక్ష్మీ నారాయణ ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశారు. ఇప్పటికే 10 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకు పోయిన ఏపీపై బనకచర్ల ప్రాజెక్టు మరో గుదిబండలా మారబోతోందని, అందుకే ప్రాజెక్టును అడ్డుకోవాలని ప్రజల్ని హెచ్చరిస్తున్నారు. దీనితో అయినా కేంద్రం ఇలాంటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది.

# ముఖం చాటేసిన వర్షాలు

- నైరుతి కానరాక రైతుల్లో ఆందోళన
- వేసిన పంటలు దక్కుతాయా లేదా అన్న భయం



**వరంగల్, జూలై 16 :** అనేక జిల్లాల్లో వర్షాలు రైతులను ఊరించి ఉసూరుమనిపించాయి. వానాకాలం సీజన్ ప్రారంభమై 45 రోజులు దాటుతున్నా, సరైన వానలు కురవకపోవడంతో వేసిన విత్తనాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. మే నెల రెండో వారంలో కురిసిన వర్షాలతో అన్నదాతలు సంతోషపడ్డారు. కొంద రు పత్తి విత్తనాలు నాటుకోగా, మరికొందరు వరి నారుమడులు దున్నుకున్నారు. ఇంకొందరు నేరుగా వడ్లు చల్లుకున్నారు. ఆ తర్వాత అడపాదడపా వర్షాలు తప్ప వానలు జోరందుకోవడం లేదు. దీంతో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు లోటు– వర్షపాతమే నమోదైంది. వెదజల్లుడు పద్ధతిలో వేసిన వరి పొలాలతో పాటు, నారుమడులు, పత్తి మొక్కలు ఎండే పరిస్థితి వచ్చింది. వాటిని కాపాడుకునేందుకు అన్నదాతలు కష్టాలు పడుతున్నారు. బావి, బోర్లున్న రైతులు నీటి తడులు కట్టుకుంటుండగా, పూర్తిగా వర్షాధారంపైనే పంటలు వేసిన రైతులు మాత్రం చినుకు పడకపోతుందా అని ఆశగా ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. అనేక మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. సాధారణం కంటే తక్కువగా వర్షాలుపడ్డాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొంత భిన్నమైన పరిస్థితి ఉంది. 23 మండలాలకు గాను 11 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. నాలుగు మండలాల్లో సాధారణం కంటే ఎక్కువగా వర్షాలు పడగా, మిగిలిన 8 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. పినపాకలో 46.8 శాతం, కరకగూడెంలో 46.5 శాతం, దుమ్ముగూడెంలో 42.7, మణుగూరులో 34.7 శాతం లోటు– వర్షపాతం నమోదైంది. జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా నారుమడులు ఎండిపోతున్న విషయాన్ని బాధిత రైతులు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో నాలుగు రోజుల కింద సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటిని విడుదల చేశారు. రెండ్రోజుల కింద పాలేరు రిజర్వాయర్ నుంచి సాగర్ నీటిని విడుదల చేశారు. నాలుగైదు రోజుల్లో ఆయకట్టు– మండలాల పరిధిలో ఈ ప్రాజెక్టుల ద్వారా విడుదల చేసిన నీరు పంటలకు ఉపయోగపడే అవకాశం ఉంది. ఆయకట్టు– లేని మండలాల్లో మాత్రం పూర్తిగా వర్షాలపైనే ఆధారపడి ఉండడంతో వానలు ముమ్మరంగా కురిస్తే తప్ప పంటలను దక్కించుకునే పరిస్థితి లేదు. సరైన వర్షాలు లేక మొలిచిన పత్తి మొక్కలు వాడిపోతున్నాయి.. మొదట వేసిన విత్తనాలు మొలవకపోవడంతో రెండోసారి వేయాల్సి వచ్చింది. వాన వస్తేనే పెట్టిన పెట్టుబడు లైనా వస్తాయని ఆశ పడుతున్నారు. జులై నెల సగం గడిచినా ఆశించిన మేర వర్షాలు పడకపోవడంతో నారు ముదిరిపోతోంది. మరో వారం రోజుల్లో వర్షాలు పడకపోతే నారు పనికి రాకుండా పోతుంది. లక్షలాది మంది రైతుల పరిస్థితి ఇదే విధంగా ఉంది. వానాకాలం ప్రారంభమై నెలన్నర గడిచినా కనీస వర్షపాతం నమోదు కాకపోవడంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. లోటు వర్షపాతం నమోదు కావడం కలవరపెడుతోంది. ప్రస్తుత సీజన్‌లో లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేయగా జులై రెండో వారం గడిచినా 20 శాతం పంటలు కూడా సాగులోకి రాలేదు. ఉమ్మడి మెదక్ జిల్లాలో వరి 3.6 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుందని అంచనా వేస్తే ప్రస్తుతం 30 వేల ఎకరాలలోపే సాగవుతుంది. 1.20 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని అంచనా వేయగా 60 వేల ఎకరాల్లో మాత్రమే గింజలు విత్తారు. మొక్కజొన్న 30 వేల ఎకరాల్లో అంచనా వేయగా 15 వేలు, కందులు 10 వేల ఎకరాల అంచనాల్లో 3 వేల ఎకరాల్లో మాత్రమే సాగు చేస్తున్నారు. జిల్లాలో జులై రెండో వారం నాటికి 183.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 155.9 మిల్లీ మీటర్ల వర్షం మాత్రమే కురిసింది. సాధారణ వర్షపాతంలో 27.3 లోటు– వర్షపాతం నమోదైంది.

## 'పీఎం ధన్ ధాన్య కృషి యోజన'కు

# కేంద్ర క్యాబినెట్ ఆమోదం

### 100 జిల్లాల్లో అమలు



**ఢిల్లీ:** కేంద్ర క్యాబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. 'పీఎం ధన్ ధాన్య కృషి యోజన'కు ఆమోదం తెలిపింది. వ్యవసాయ, అనుబంధ రంగాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఏటా రూ.24వేల కోట్ల వ్యయంతో దేశ వ్యాప్తంగా 100 జిల్లాల్లో ఈ ప్రోగ్రామ్‌ని అమలు చేయనున్నారు. 2025–26 నుంచి ఆరేళ్ల కాలానికి 100 జిల్లాలను కవర్ చేసేలా దీన్ని చేపట్టనున్నారు. అలాగే, పునరుత్పాదక ఇంధనంలో ఎన్‌టీపీసీకి రూ.20వేల కోట్ల పెట్టుబడులకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే, రోదసిలో 18 రోజులు గడిపి, అనేక ప్రయోగాలను నిర్వహించి విజయవంతంగా భూమికి తిరిగివచ్చిన వ్యోమగామి శుభాంశు శుక్లాను అభినందిస్తూ క్యాబినెట్ తీర్మానం చేసింది. కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలను కేంద్ర సమాచార, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు.

**'పీఎం ధన్ ధాన్య కృషి యోజన' అమలు ఇలా..**

- వ్యవసాయ రంగంలో ఉత్పాదకతను పెంచడం, పంటల్లో వైవిధ్యీకరణ, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం, పంటకోత తర్వాత గ్రామస్థాయిల్లో దిగుబడులను నిల్వ చేసేందుకు గోదాముల సదుపాయం, నీటిపారుదల సౌకర్యాలను మెరుగుపరచడం, రుణ లభ్యతను సులభతరం చేయడమే లక్ష్యంగా పీఎం ధన్ ధాన్య కృషి యోజనను రూపొందించారు. ఈ కార్యక్రమం కోసం ఏటా రూ.24వేల కోట్లు వ్యయం చేయనున్నారు.
- మొత్తం 11 శాఖల్లో 36 పథకాలు, రాష్ట్రంలోని ఇతర పథకాలు, ప్రైవేటు రంగంతో స్థానిక భాగస్వామ్యం ద్వారా దీన్ని అమలు చేయనున్నారు.
- ఉత్పాదకత తక్కువగా ఉండటం, అన్ని రుతువుల్లోనూ పంట సాగుబడి చేయకపోవడం, రుణ లభ్యత అత్యంత తక్కువగా ఉండటం అనే మూడు కీలక సూచికల ఆధారంగా 100 జిల్లాలను గుర్తిస్తారు.
- ఈ పథకం సమర్థవంతంగా అమలు జరిగేలా పర్యవేక్షించేందుకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి ధన్–ధాన్య జిల్లాలో ఈ పథకం పురోగతిని 117 పెర్ఫామెన్స్ ఇండికేటర్ల ద్వారా పర్యవేక్షిస్తారు.
- దీని ద్వారా ఏటా 1.7కోట్ల మంది రైతులకు ప్రయోజనం కలిగే అవకాశం ఉన్నట్లు అంచనా.

# దసరా నాటికి ఉప్పల్ ప్లై ఓవర్ పూర్తి

### పనుల తీరును పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి



**హైదరాబాద్, జూలై 16 :** ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి నారపల్లి వరకు 8 కిలోమీటర్ల మేరకు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పేనులు శరవేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. వచ్చే దసరా నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బుధవారం ప్రభుత్వం విఫ్ బీర్ల ఐలయ్య, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తో కలిసి వంతెన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. యాదగిరిగుట్ట భువనగిరి వరంగల్ జాతీయ రహదారిపై దాదాపు 8 సంవత్సరాల క్రితం ప్రారంభించిన పనులు ఆర్థిక వనరులు, ఇతర కారణాల వల్ల తీవ్ర జాప్యం జరిగిందన్నారు. తమ ప్రభుత్వం రాగానే ఈ పనులపై ప్రత్యేక దృష్టి సారించి కేంద్ర మంత్రి నితిన్ గట్కారీతో సైతం చర్చలు జరిపి పనుల్లో వేగం పెంచామన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి మొన్నటి వరకు పనులు నిర్వహించిన కాంట్రాక్టర్ను సైతం మార్చి కొత్తవారికి పనులు అప్పగించామని కోమటిరెడ్డి వివరించారు. ప్రత్యేక శ్రద్ధతో పనుల్లో వేగాన్ని పెంచి పరితగతిన పూర్తి చేస్తామని వెల్లడించారు. నగరంలో పివి ఎక్స్ప్రెస్ హైవే తర్వాత అతిపెద్ద ఫ్లైఓవర్ గా పేరున్నదని స్పష్టం చేశారు. వచ్చే దసరా నాటికి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటు–లోకి తీసుకొస్తామని మంత్రి తెలియజేశారు. నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆపేయడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. గుంతల రోడ్డుపై అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కొన్ని కారణాల వల్ల కారిడార్ పనులు పూర్తి కాలేదని, ఈ విషయంలో ఎవరినీ తప్పు పట్టాల్సిన అవసరం లేదన్నారు. తొలుత నిర్మాణ పనులు చేపట్టిన గాయత్రీ సంస్థ తప్పుకోవడంతో పనులను మరో సంస్థకు అప్పగించామన్నారు. త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేసి దసరా నాటికి అందుబాటు–లోకి తీసుకొస్తామని మంత్రి తెలిపారు.

# ట్రంప్ ప్రకటనలపై సమాధానం ఇవ్వాలి

### పార్లమెంట్ వేదికగా ప్రధాని స్పందించాలి
### ఎక్స్ వేదికగా కాంగ్రెస్ నేత జైరామ్ డిమాండ్

**న్యూఢిల్లీ, జూలై16 :** ఈ నెల 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరగనున్న తరుణంలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ప్రశ్నల వర్షం కురిపించడానికి సమాయత్తం అవుతోంది. భారత్ పాక్‌ల మధ్య కాల్పుల విరమణ తానే చేశానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలుమార్లు పునరుద్ఘాటించిన సంగతి తెలిసిందే. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలపై పార్లమెంట్‌లో ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. కాంగ్రెస్ కార్యదర్శి జైరాం రమేశ్ భారత్‌తో వాణిజ్య ఒప్పందంపై ట్రంప్ చేసిన వ్యాఖ్యాలను ట్యాగ్ చేస్తూ సామాజిక మాధ్యమంలో ఓ పోస్టు చేశారు. అందులో భారత్ పాక్ మధ్య అణు యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ 23 సార్లు పునరుద్ఘాటించారు. ఈ నెల 21 నుంచి వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు జరగనున్నాయి. లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రధాని మోదీ దీనిపై స్పష్టమైన సమాధానం చెప్పాలి. దేశ ప్రజలు తెలుసుకోవాలనుకుంటు న్నారని జైరాం రమేశ్ పోస్టులో పేర్కొన్నారు. భారత్ పాక్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం తానే చేశానని ట్రంప్ తాజాగా సోమవారం మళ్లీ పునరుద్ఘాటించారు. మే 10 నుంచి ట్రంప్ భారత్ పాక్ మధ్య సయోధ్య కుదిర్చినట్లు– సోషల్ మీడియాలో ప్రకటిస్తూ వస్తున్నారు.



## దరఖాస్తులు పరిశీలించాక
# కొత్త రేషన్ కార్డులు

### ఆన్‌లైన్‌లో పరిశీలన అయ్యాక జారీ

**నిజామాబాద్, జూలై 16 :** ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కొత్త రేషన్ కార్డులు 771 జారీ కానున్నాయి. పాత వాటితో పాటు, కొత్త కార్డుల్లో అదనంగా 1,73,388 మంది సభ్యులను చేర్చారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కొత్త కార్డులు జారీ చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇది నిరంతర పక్రియ. కొత్త కార్డుల పంపిణీ ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాల తర్వాత లబ్ధిదారులకు ఇస్తాం. ఇప్పటికే పత్రాలు వచ్చాయి. ఆన్‌లైన్‌లో వచ్చే అప్లికేషన్లను పరిశీలిస్తూ వెంటనే జారీ చేస్తున్నాం. ఇంకా జారీ చేస్తాం అని అన్నారు. నియోజక వర్గాల వారీగా మీటింగ్‌లు నిర్వహించి కార్డుల పంపిణీ చేసే అవకాశముందని అధికారులు పేర్కొంటున్నారు. దీనిపై ఉన్నతాధికారుల నుంచి సమాచారం రావాల్సి ఉందని చెబుతున్నారు. సీఎం సందేశంతో కూడిన లేఖలు ఇప్పటికే డీఎస్‌వో ఆఫీసులకు చేరాయి. కార్డులతోపాటు–, లబ్ధిదారుల సంఖ్య పెరిగిన దృష్ట్యా బియ్యం కోటా పెరగనుంది. ఈ నెలలో కొత్తగా జారీ అవుతున్న కార్డులు, కొత్త సభ్యులకు సెప్టెంబర్ నెలలో రేషన్ బియ్యం ఇస్తారు. ఇప్పటికే ఆగస్టు నెల వరకు 3 నెలల కోటాను జూన్ లోనే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కొత్త కార్డులు ఇస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి రాగానే కాంగ్రెస్ సర్కార్ కొత్తగా రేషన్ కార్డులతో పాటు–, ఇది వరకు ఉన్న కార్డుల్లో కొత్త సభ్యుల పేర్లు చేర్చే పక్రియ చేపట్టింది. గ్రామాలు, టౌన్‌లలో ప్రజా పాలన మీటింగ్‌లు నిర్వహించి అప్లికేషన్లు స్వీకరించారు. దీంతో పాటే మీసేవలో అప్లికేషన్లు తీసుకున్నారు. గత కొన్ని నెలలుగా పాత రేషన్ కార్డుల్లో సభ్యులను చేర్చటం, కార్డుల జారీ పక్రియ నిర్వహిస్తోంది. అప్లికేషన్లను వెరిఫికేషన్ చేసి అర్హులైన వారికి ఆన్ లైన్‌లో ఎంట్రీ చేసి కార్డులు ఇస్తారు. ఇప్పటికే కొత్త సభ్యులను పాత కార్డుల్లో చేర్చిన వారికి కూడా బియ్యం వచ్చాయి. చాలా మంది కొన్నేళ్లుగా రేషన్ కార్డుల కోసం, కొత్త సభ్యులను చేర్చటం కోసం మీసేవాతో పాటు, ఆఫీసుల్లో దరఖాస్తు చేసుకున్నారు. గ్రామాలకు వచ్చే ప్రజాప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో కూడా తమకు రేషన్ కార్డులు ఇప్పించాలని వినతిపత్రాలు ఇచ్చారు. కొత్త కార్డులను జారీ చేయడంతో పాటు–, మెంబర్లను చేర్చడం పై గత ప్రభుత్వం దృష్టి సారించలేదు. దీంతో ప్రతి జిల్లాలో వేలాది సంఖ్యలో అప్లికేషన్లు ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి.

# రోడ్డుపక్కన పసికందు

### అక్కున చేర్చుకున్న గ్రామస్థులు

**జనగామ, జూలై 16 :** జిల్లాలో ఓ దారుణ ఘటన చోటు–చేసుకుంది. కన్నపేగు బంధాన్ని తెంచుకుంటూ.. ఓ తల్లి రోడ్డు పక్కన పసికందును వదిలేసి వెళ్లిపోయింది. పసిబిడ్డ ఏడుపు విన్న స్థానికులు.. స్నానం పోసి అక్కున చేర్చుకున్నారు. పరిసర ప్రాంతాల్లో ఎంత వెతికినా ఆ బిడ్డ తల్లిదండ్రులు కనిపించలేదు. దాంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ముక్కు పచ్చలారని పసికందును బహిరంగ ప్రదేశంలో వదిలేసిన ఘటన జనగామ జిల్లాలో ఇప్పుడు కలకలం సృష్టించింది. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఖిలాషాపురం గ్రామంలో రోడ్డుపై గుర్తుతెలియని మహిళ పసికందును వదిలేసి వెళ్లింది. బుధవారం తెల్లవారుజామున పసిబిడ్డ ఏడుపు వినిపిస్తుండటంతో.. సమీపంలోని స్థానికులు నిద్ర లేచి చూశారు. అప్పుడే పుట్టిన మగ శిశువు రోడ్డుపై గుక్కపెట్టి ఏడుస్తున్నాడు. నడిరోడ్డుపై ముక్కు పచ్చలారని పసికందును చూసి స్థానికులు చలించిపోయారు. గ్రామంలోని ఒక వృద్ధురాలు చిన్నారిని చేరదీసి.. స్నానం చేయించింది. ఖిలాషాపురం గ్రామస్తులు పసిబిడ్డ తల్లిదండ్రుల కోసం చుట్టు–పక్కల అంతా వెతికినా లాభం లేకపోయింది. బిడ్డకు సంబంధించిన వారు ఎవరూ కనిపించకపోవడంతో గ్రామ పెద్దలు రఘునాథపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నారు. పసిబిడ్డ తల్లిదండ్రుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



## మొక్కలు నాటాలి.. పర్యావరణాన్ని పరిరక్షించాలి

### మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

- ఘట్కేసర్ మండలం ఔషపూర్ గ్రామంలో మొక్కలు నాటిన అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

**ఘట్కేసర్, రాజముద్ర న్యూస్:** ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని పర్యావరణాన్ని పరిరక్షించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా తెలిపారు. ఈ మేరకు బుధవారం 100 రోజుల అభివృద్ధి కార్యచరణ కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ జిల్లా పరిధిలోని ఘట్కేసర్ మండలం ఔషపూర్ గ్రామంలో స్థానిక ప్రజలతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... అధిక సంఖ్యలో మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు. ప్రతి ఒక్కరు ఇంటింటికి ఒక మొక్క నాటి వాటిని సంరక్షిరాలన్నారు. ఘట్కేసర్ మున్సిపల్ కమిషనర్, అనురాగ్ విశ్వవిద్యాలయ విద్యార్థులు కూడా ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు.



## ఫిల్మ్, మీడియా కోర్సులపై అవగాహన

**చెవెళ్ళ, రాజముద్ర న్యూస్ :** చెవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (ఎన్ఏసి), ఎస్పి ఎసి ఈ అకాడమీ, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్మాణం, ఫిల్మ్, మీడియా ఎంటర్టైన్‌మెంట్ రంగాలలో ఉన్న వృత్తి అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. కార్యక్రమంలో ఎన్ఏసి అసిస్టెంట్ డైరెక్టర్ అంజయ్య, ప్రసాద్ పాల్గొని నిర్మాణ రంగంలో నైపుణ్యాల అవసరాన్ని వివరించారు. స్పేస్ అకాడమీ నుండి శాస్త్రి, శ్రీమతి స్వప్న, ఫిల్మ్, మీడియా కోర్సుల ముఖ్యతను, అందుబాటులో ఉన్న మూడు నెలల ప్రాయోగిక కోర్సుల వివరాలను తెలిపారు. ప్రిన్సిపల్, డాక్టర్ కంచనలతా రెండు సంస్థల ప్రయత్నాలను అభినందిస్తూ, ఈ తరహా కోర్సులు విద్యార్థులకు సృజనాత్మకత, వృత్తి పరమైన ప్రత్యామ్నాయాలు అందిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా శ్రీమతి ఎ కవిత వ్యవహరించారు. ఈ కార్యక్రమం డాక్టర్ ఎం రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



## సోలిపేట రైతులకు నోటీసులు ఇచ్చిన రెవిన్యూ శాఖ

- లావని పట్టా భూమిలో ధళారులు మట్టి రవాణాతో చిక్కుల్లో పడ్డ రైతులు
- జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డిని కలిసిన రైతులు

**షాబాద్, రాజముద్ర న్యూస్:** రైతులకు చెందిన లావని పట్టా భూముల్లో నుంచి దళారులు మట్టి రవాణా చేస్తున్నడంతో, సదరు లావని పట్టా భూముల రైతులకు రెవెన్యూ శాఖ నోటీసులు ఇచ్చిన సంఘటన షాబాద్ మండలంలోని సోలిపేట గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. షాబాద్ మండలంలోని సోలిపేట గ్రామ రైతులు 350 సర్వే నంబర్ లో ఉన్న లావని పట్టా భూమిలో కొంతమంది దళారులు మట్టి రవాణా చేసిన కారణంగా రెవెన్యూ డిపార్ట్మెంట్ వారు రైతులకు నోటీసులు ఇవ్వడం జరిగింది. ఈ సమస్యను రైతులందరూ కలిసి న్యాయం చేయాలని రంగారెడ్డి జిల్లా గ్రంధాల సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డిని కోరడం జరిగింది. అయన వెంటనే చేవెళ్ల ఆర్డిఓతో మాట్లాడి రైతుల సమస్యలను తీరుస్తానని హామీ ఇవ్వడం జరిగింది. గ్రామస్తులతో పాటు గ్రామ పెద్దలు జనార్దన్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, కుమ్మరి విఠల్ రావడం జరిగింది.



## మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని సన్మానించిన వాకిటి అనంతరెడ్డి

**వలిగొండ రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి పట్టణంలో మినర్వా, బ్లూ ఫాక్స్ రెస్టారెంట్ ప్రారంభోత్సవం కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి వారికి శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమం లో అరూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బుర్ర నరసింహ, మాజీ ఉపసర్పంచ్ సుక్క ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞాన వికాసానికి పుస్తక పఠనం మేలు చేస్తుంది

- విద్యార్థులు యూపీఎస్సీ పరీక్షలపై అవగాహన పెంచుకోవాలి
- విద్యలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు పారితోషికం,స్టడీ మెటీరియల్ అందజేత
- పాలకుర్ల శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ చైర్మన్ పాలకుర్ల మురళి
- ఆదర్శ పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ సరస్వతి




**యాదాద్రి భువనగిరి జిల్లా రాజముద్ర న్యూస్:** జ్ఞాన వికాసానికి పుస్తక పఠనం ఎంతో మేలు చేస్తుందని,విద్యార్థులు యూనియన్ పబ్లిక్ సర్వీస్ పరీక్షలపై అవగాహన పెంచుకోవాలని పాలకుర్ల శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ చైర్మన్ పాలకుర్ల మురళి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ పురపాలక కేంద్రం, లక్కారం గ్రామ పరిధిలోని ఆదర్శ పాఠశాలలో పాలకూర్ల శివయ్య గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం యూనియన్ పబ్లిక్ సర్వీస్ పరీక్షల పైన అవగాహన కార్యక్రమాన్ని ఆదర్శ పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ పాలకుర్ల మురళి మాట్లాడుతూ... యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష విధానంలో ఉన్న మౌలిక అంశాల స్వరూపాన్ని విద్యార్థులకు తెలియపరిచారు. యూపీఎస్సీ చదవాలని ఆకాంక్ష ఉన్న విద్యార్థులకు తమ ఫౌండేషన్ చేయూతనందిస్తుందని విద్యార్థులకు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు యూపీఎస్సీ పరీక్షలపై అవగాహన కలిగించి వారిని ఆ దిశగా ఎదిగే విధంగా పాలకుర్ల శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ కృషి చేస్తుందని తెలిపారు. ఇష్టంతో కష్టపడి చదివితే సులువుగా చేరుకోవచ్చునని విద్యార్థు ఓలకు తెలిపారు. యూపీఎస్సీ స్టడీ మెటీరియల్, మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలను ప్రిన్సిపల్ సరస్వతి చేతుల మీదుగా ఆయన విద్యార్థులకు అందజేశారు. యూపీఎస్సీ కి సంబంధించిన మరికొంత స్టడీ మెటీరియల్ ను పాఠశాల గ్రంధాలయానికి త్వరలో అందజేస్తానని తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ సరస్వతి మాట్లాడుతూ.. పాలకుర్ల శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని,వారు అందించిన యూపీఎస్సీ స్టడీ మెటీరియల్ ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఈ స్టడీ మెటీరియల్ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఎంతోమంది చదువుకున్న యువత నేడు గ్రామీణ ప్రాంతాల నుండి ఐఏఎస్,ఐపీఎస్ వంటి ఉన్నత ఉద్యోగాలను సాధిస్తున్నారని గుర్తు చేశారు. ఆదర్శ పాఠశాలలో 6,7, 8,9,10, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు పాలకుర్ల శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ చైర్మన్ పాలకూర్ల మురళి విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతిని వారి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకుర్ల శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ చైర్మన్ పాలకుర్ల మురళి,ఆదర్శ పాఠశాల,కళాశాల ప్రిన్సిపల్ సరస్వతి, ఉపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి, వెంకటరమణ, పూర్ణిమ, ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాలువ మరమ్మతు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కుంభం

### కాలువ పనులను త్వరగా పూర్తి చేయాలి





**వలిగొండ రాజముద్ర న్యూస్:** పంట కాలువలతో రైతులకు నీరంధించి రైతులకు సాగునీరు సమస్య లేకుండా చూస్తామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం కుమార్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గోకారం గ్రామంలో ధర్మారెడ్డిపల్లి కాలువను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కాల్వలు అభివృద్ధికి నోచుకోలేదని, కాలువల పేరుతో లక్షల కోట్లు అప్పు చేశారని,కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే కాల్వల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ధర్మారెడ్డి పల్లి కాలువ అభివృద్ధికి 123 కోట్ల రూపాయల వ్యయంతో 6 మీటర్ల వెడల్పుతో కాలువ అభివృద్ధి పనులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 5 నియోజక వర్గాలలో 12 మండలాల రైతులకు మేలుజరుగుతుందన్నారు. అంతేకాకుండా రైతులకు ఎలాంటి సమస్య లేకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందని కూడా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శేఖర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి జగన్నాధ రావు, ఎమ్మార్వో దశరథ,మండల మాజీ ఎంపీపీ నూతి రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమా నాయక్, గరిసె రవి, కంకల కిష్టయ్య, కాసుల వెంకన్న ఐటి పాముల రవీందర్, గుండు దానయ్య,పాశం స్వామి, మైసొల్ల ప్రవీణ్, బద్దం సంజీవరెడ్డి, పులి పలుపుల రాములు, ఎస్కే రసూల్ పాల్గొన్నారు.

## కళాశాలలో అడ్మిషన్లు పెంచే విధంగా కృషి చేయాలి

### ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్పెషల్ ఆఫీసర్ జ్యోత్స్నా రాణి




**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్స్ పెంచడానికి ప్రిన్సిపాళ్ళు కృషి చేయాలని తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు జాయింట్ సెక్రటరీ అండ్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్పెషల్ ఆఫీసర్ డా. జ్యోత్స్న రాణి అన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో ప్రిన్సిపాల్స్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ...ఇంటర్ విద్య కమీషనర్ ఆదేశాల ప్రకారం ప్రతి కళాశాలలో అడ్మిషన్లు పెంచడానికి ప్రిన్సిపాళ్ళు ఉపన్యాసకులతో సమన్వయం చేసుకుని ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అన్నారు. ప్రతి జూనియర్ కళాశాలలో మౌలిక వసతుల కల్పన కోసం కమీషనర్ నిధులు విడుదల చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ ద్వారా విద్యార్థులకు కళాశాలలో ఎప్సెట్, నీట్, జె ఈ ఈ ఆన్లైన్ శిక్షణ ఇస్తామన్నారు. కళాశాలల రిపేర్ వర్క్స్ కోసం నిధులు కమీషనర్ కేటాయించినట్టు తెలిపారు. కళాశాలల్లో నెలకొన్న సమస్యలపై ప్రిన్సిపాళ్లతో చర్చించారు. అనంతరం జిల్లా ఇంటర్ విద్యాధికారి, ప్రిన్సిపాళ్ళు జాయింట్ సెక్రటరీ డా. జ్యోత్స్న రాణి ని సన్మించారు. అనంతరం ప్రిన్సిపాళ్ళు నూతనంగా జిల్లాకు ప్రిన్సిపాళ్ళుగా జిల్లా కు వచ్చిన రోజారాణి, వసంత,రమణ కుమారి లను సన్మానించారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాళ్ళు రూపా లక్ష్మి, నర్సింహా రెడ్డి, కుమార స్వామి, బుచ్చి రెడ్డి, సురేశ్వర స్వామి, వెంకటేశ్వర్ రావు తో పాటు మల్లి నాథప్ప, పందరి, మక్బుల్, ఆఫీస్ సిబ్బంది వినోద్, సలీమా బేగం, ఇందిరమ్మ పాల్గొన్నారు.

## వలిగొండ మండలానికి అదనపు సర్వేయర్‌ను నియమించాలి

### తహసిల్దార్‌కు సిపిఎం నాయకుల వినతి



**వలిగొండ రాజముద్ర న్యూస్:** వలిగొండ మండలంలోని 37 గ్రామాల్లో ఉన్న రైతాంగం సర్వేయర్ సక్రమంగా అందుబాటులో ఉండకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తమ యొక్క భూముల ఎక్కువ తక్కువలను సరి చేసుకునేందుకు అనేకమంది తహసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని వెంటనే అదనపు సర్వేయర్ నియమించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహసిల్దార్ దశరథ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ జిల్లాలోని అతిపెద్ద మండలం గా ఉన్న వలిగొండ మండలానికి ఒక్కరే సర్వేయర్ ఉండడంతో వారు సక్రమంగా రైతులకు అందుబాటులో లేక రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఒకవైపు ఉన్న ఒక్క సర్వేయర్ ను బునాది గాని, ధర్మారెడ్డి పల్లి, మరియు కాళేశ్వరం కాలువల సర్వేల కోసం పై అధికారులు నిరంతరం పంపుతుండడంతో సర్వేయర్ అందుబాటులో లేకపోవడంతో రైతులు తమ పంట పొలాలను కొలిచేందుకు రోజుల తరబడి తహసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని వెంటనే జిల్లా కలెక్టర్ మరియు జిల్లా స్థాయి రెవిన్యూ అధికారులు స్పందించి మండలానికి అదనంగా సర్వేయర్ ను నియమించాలని రైతాంగ సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు కందడి సత్తిరెడ్డి, మండల కమిటీ సభ్యులు కొండె కిష్టయ్య,మండల నాయకులు మంగ బాలయ్య,కందగట్ల సాయి రెడ్డి,కంబాలపల్లి మల్లేశం, రైతులు నరసింహ,నాగయ్య, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



## మేడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ ఏర్పాటు

- ల్యాబ్‌ను ప్రారంభించిన మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారిణి విజయ కుమారి, ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి
- పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్, ఉపాధ్యాయ బృందం

**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** విద్యార్థులలో వినూత్న ఆలోచనలను పెంపొందించడం, వారిలో పరిశోధన సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించడం కోసం అటల్ టింకరింగ్ ల్యాబ్ లు ఎంతగానో ఉపయోగపడతాయని మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారిణి విజయకుమారి తెలిపారు. ఈ మేరకు బుధవారం మేడ్చల్ జిల్లా పరిధిలోని మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్ ను డిఇఓ విజయకుమారి, మేడిపల్లి మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్ లతో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించి ల్యాబ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భారత ప్రభుత్వం అటల్ ఇన్నోవేషన్ మిషన్ (ఏఐఎం) ద్వారా పాఠశాలల్లో ల్యాబ్ ఏర్పాటు చేయబడుతున్నాయని అన్నారు. టింకరింగ్ ల్యాబ్ సాంకేతికతను ఉపయోగించి విద్యార్థులలో నూతన ఒరవడిని సృష్టించడానికి, ఆవిష్కరించడానికి వీలు కల్పిస్తుందని, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు విద్యార్థులకు విస్తృత శ్రేణి సాధనాలు, సాంకేతికతలకు యాక్సెస్‌ను అందిస్తాయి, సాంకేతికతను ఉపయోగించి వాటిని ఆవిష్కరించడానికి, సృష్టించడానికి వారిని శక్తివంతం చేస్తాయని అన్నారు. ఇది విద్యార్థులలో సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు, ఆవిష్కరణ ఆలోచనలను పెంపొందించడానికి రూపొందించబడింది. ఈ ల్యాబ్ 6 నుండి 12 వ తరగతి వరకు విద్యార్థులకు అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## గర్భిణీ స్త్రీలకు మెరుగైన సేవలందించాలి

### మాతా శిశు సంక్షేమం ప్రోగ్రాం అధికారి డాక్టర్ మంజుల

**భీమదేవరపల్లి రాజముద్ర న్యూస్ :** గర్భిణీ స్త్రీలకు మెరుగైన సేవలందించాలని మాతా శిశు సంక్షేమం ప్రోగ్రాం అధికారి డాక్టర్ మంజుల సూచించారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మంజుల మాట్లాడుతూ... గర్భ నిర్ధారణ జరిగిన వెంటనే గర్భిణీ స్త్రీలను నమోదు చేయాలని, వారికి అవసరమైన పరీక్షలు నిర్వహించి అతి ప్రమాదకరమైన లక్షణాలు గుర్తించిన వారికి తగిన సేవలు అందించాలన్నారు. సరైన వసతులు ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం జరిగేలా ప్రోత్సహించాలన్నారు. రక్తహీనత కలిగిన వారికి తప్పకుండా ఐరన్ మాత్రలు తీసుకునేలా చూడాలన్నారు. ప్రసవం తర్వాత సంవత్సరం వరకు సేవలు అందించాలన్నారు. అంగన్వాడి టీచర్లతో గర్భిణీ స్త్రీలు, పిల్లల విషయంలో సమన్వయంతో పని చేయాలన్నారు. పోషణ లోపం గుర్తించిన పిల్లలను వైద్య అధికారి పరీక్షలు నిర్వహించి చికిత్స అందించాలన్నారు. కాన్పుకు కాన్పుకు మధ్య ఎడం కోసం అందుబాటులో ఉన్న తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులను దంపతులకు వివరించి అవలంబించేలా చూడాలన్నారు. ఏఎన్ఎం, ఆశాలు నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి తగిన సూచనలు అందించారు. ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ రెడ్డి ఆరోగ్య కేంద్రం పరిధిలో అందిస్తున్న సేవలు అలాగే టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో చేపడుతున్నా చర్యలను వివరించారు. జిల్లా మాస్ మీడియా అధికారి వి.అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. గృహ సందర్శన ,అంగన్వాడీ కేంద్రంలో జరిగే కార్యక్రమాలలో, గ్రామ మహిళ సమాఖ్య సమావేశాలలో, సీజనల్ వ్యాధుల నియంత్రణ మాతా శిశు సంక్షేమ కార్యక్రమాలు, టీబీ ముక్త అభియాన్ ఇతర ఆరోగ్య కార్యక్రమాల గురించి అవగాహన కలిగించాలని, ఇతర ప్రభుత్వ విభాగాలతో సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో రాజేశ్వర్ రెడ్డి, నర్సింగ్, మల్లీశ్వరి, సూపర్వైజర్లు భారతి ,రాజయ్య, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



## అంగరంగ వైభవంగా శాకాంబరీ ఉత్సవం

### కన్నుల పండుగలా వేడుక వందలాది భక్తుల సందర్శన



**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** మియాపూర్ బస్ బాడీ వద్ద గల శ్రీ కనక దుర్గా కాళీ మాతా ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు మాన్య సందీప్ మహరాజ్ ఆధ్వర్యంలో కనక దుర్గా కాళీ మాతా ఆలయ కమిటీ అధ్యక్షులు బండారు వినయ్ రాజ్ ముదిరాజ్, బండారు మోహన్ ముదిరాజ్, జనరల్ సెక్రటరీ లు బి.ఎస్.ఎన్ సాయి యాదవ్, శ్రావణ్ నాయుడు ఉపాధ్యక్షులు గుండె దయానంద్ ముదిరాజ్ తదితరుల ఆధ్వర్యంలో అమ్మవారిని శాకాంబరీ రూప అలంకరణ కోసం శాఖాహార కూరకాయలు, ఫలాలతో తో మాలలు గా తయారు చేసి భక్త మహాశయులు, మహిళలు కృషి చేసి వారి సహకారం తో అమ్మ వారిని అలంకరించి ఘనంగా శాకాంబరీ ఉత్సవం నిర్వహించారు. మునుపెన్నడూ లేని విధంగా అమ్మ వారి శాకాంబరీ ఉత్సవం ను అంగరంగా వైభవం గా కన్నుల పండుగ ల నూతన ఆలయ కమిటి సభ్యులు భక్తి శ్రద్ధలతో అమ్మ వారి కి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బండారు మోహన్ ముదిరాజ్, బిజెపి మియాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్, చందు, పట్టాభిరామ్, శ్రీకాంత్, సురేష్, వంశీ, నవీన్, సాయి, అనోక్, ఇంద్రనీల్, మనోజ్, నాని పంతులు తదితరులతో పాటుగా పెద్ద ఎత్తున భక్త మహాశయులు పాల్గొన్నారు. ఆలయం లో అమ్మ వారిని దర్శించిన భక్త మహాశయులకి కోరిన కోర్కెలు నెరవేరి నిత్యం అమ్మ ఆశీర్వాదములు ఉంటాయని అలాగే గురువారం రోజున చండీ హోమం నిర్వహించబడుతుందని కావున భక్తులు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో హాజరై అమ్మ వారి కృపా కటాక్షముల కి పాత్రులు కాగలరని శ్రీ కనక దుర్గా కాళీ మాతా ఆలయ ప్రధాన అర్చకులు మాన్య సందీప్ మహరాజ్, నాని పంతులు, శ్రావణ్ నాయుడు లు ఈ సందర్భంగా తెలియజేశారు.





## స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోతామనే భయంలో కాంగ్రెస్

- రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** స్థానిక సంస్థల ఎన్నికల ఓడిపోతాం అనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేస్తూ వచ్చిందన్నారు మాజీ మంత్రి, ప్రస్తుత మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి. చేవెళ్ల నియోజకవర్గం శంకర్ పల్లి మండల, మునిసిపల్ బి ఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మళ్ళీ కేసిఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆమె అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో కాంగ్రెస్ పాలన పట్ల తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని.. త్వరగా పార్టీ కార్యాలయాలన్నీ ప్రారంభించాలి సూచించారు. ప్రతి పక్షంలో ఉంటేనే నాయకులుగా ఎదిగే అవకాశం ఉంటుందని ఆమె అన్నారు. పాలకులు మంచి వారుంటే ప్రకృతి సహకరిస్తుందని, గతంలో వైఎస్సార్ ఉన్నప్పుడు, కేసీఆర్ పదేళ్ల పాలనలో వర్షాలు కురిసి చెరువులు నిండి, తెలంగాణ నేల సస్యశ్యామలం అయిందన్నారు. నేడు మళ్ళీ వర్షాలు సమృద్ధిగా కురవడం లేదని అన్నారు. ప్రతిపక్షాలు చెబితేనే ప్రాజెక్టుల గేట్లు తెరుస్తున్నారని మండిపడ్డారు. రైతు భరోసా రెండు సార్లు ఎగ్గొట్టి, ఒక్కసారి వేసి సంబరాలు అంటే, గతంలో కేసీఆర్ హయాంలో 11 సార్లు వేసినప్పుడు ఎన్ని సార్లు సంబరాలు చేసుకోవాలని ప్రశ్నించారు. రైతు చనిపోతే రూ. 5 లక్షలు భీమా రూపంలో డబ్బులు వచ్చేవి..నేడు అవి కాస్తా ప్రభుత్వం ఆపేసిందన్నారు. మహిళలకు ఇచ్చిన వాగ్దానాలు ఏమయ్యాయయి అని ప్రశ్నించారు. ఎన్నికలు వచ్చాయని రైతు బంధు వేస్తున్నారని, మరల సార్వత్రిక ఎన్నికల వరకు రైతు భరోసా వేయరని హెద్దెవా చేశారు. గతంలో రూ. 6 లక్షల 43 వేల రేషన్ కార్డులు ఇచ్చిన ప్పుడు ఈ ప్రభుత్వం లాగా ఏనాడూ హంగామా చేయలేమని...నేడు ఎన్నికల కోసం రేషన్ కార్డులు అంటూ ప్రచారం చేస్తున్నారన్నారు. గతంలో గ్రామాల నుండి నీళ్ల కోసం బోర్లు వేయాలని, ట్రాన్స్ఫార్మర్స్ కావాలని, ఖాళీ బిందెల ప్రదర్శనలు, పరిశ్రమల ప్రతినిధులు ధర్నాలు చేస్తే, కేసీఆర్ హయాంలో మిషన్ భగీరథ ద్వారా నీటి కష్టాలు, కరెంట్ కష్టాలు తీర్చితే, నేడు మళ్ళీ ఈ ప్రభుత్వం పాత రోజులు తెచ్చిందని ఆవేదన ప్రభుత్వంపై విరుచు కుబడ్డారు. మహిళలు ఖాళీ బిందెలతో రోడ్లు ఎక్కుతున్నారన్నారు. అధికారులు ప్రజల పక్షంగా పని చేయాలని, గతంలో అధికారులు ఎప్పుడు కూడా ప్రస్తుతం లాగా పాలక పక్షం మెప్పు కోసం పని చేయలేదన్నారు. కళ్యాణ లక్ష్మీతో పాటు ఇస్తామన్న తులం బంగారం, విద్యార్థినీలకు స్కూటీ లు ఇస్తామన్నా హామీని నేరవేర్చలేదన్నారు. ఓడి పోతారనే భయంతోనే స్థానిక ఎన్నికలకు ప్రభుత్వం వెనుకంజ వేస్తే, కోర్టు ఆదేశాలతో నేడు సిద్ధం అవుతుందన్నారు. శంకర్ పల్లి మండలంలో గులాబీ జెండా ఎగరాలన్నారు. సోషల్ మీడియాలో యాక్టీవ్ గా ఉండి, బిఆర్ఎస్ పార్టీ ప్రతిష్టత కోసం పాటు పడాలన్నారు. మహిళలకు రూ.2500 ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. వడ్డీ లేని రుణాలు కూడా పూర్తి స్థాయిలో వేయలేదని, మండల సమన్వయ కమిటీ వేసుకొని, గ్రామ గ్రామన పర్యటించి బిఆర్ఎస్ గెలుపుకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు.



## విద్యార్థి ఉన్నత లక్షలకు చేరుకోవాలి

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం దోమ మండలలోని షెడ్యూల్డ్ కులాల బాలుర వసతి గృహాన్ని, కె జి బి వి బాలికల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ తరగతి గదులను, డార్మెంటరీని, వాష్ రూము లను,వంట గదులను పరిశీలించి బియ్యం నాణ్య తను పరిశీలించారు. తాజా కూరగాయలు వాడాలని, మెనూ ప్రకారం భోజనం పెట్టాలని అధికారులకు అదేచించారు. 10 వ తరగతి చదువుచున్న విద్యార్థినిలతో మాట్లాడుతూ ఈ సంవత్సరం బాగా చదివి వంద శాతం మార్కులు సాదించాలని సూచించారు. మీకు అన్ని సౌకర్యాలు ఉన్నాయా, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, ఏవైనా సమస్యలున్నాయా, బుక్స్, యూనిఫార్మ్ వచ్చాయా, ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారా, విద్యార్థులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంట గదిని, స్టోర్ రూమ్ ను పరిశీలించారు. వంట సామాగ్రి వచ్చిందా మెనూ ప్రకారము భోజనం పెట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేసారు. ప్రభుత్వ బాలుర వసతి గృహమును తనిఖి చేసి, మెనూ చార్టు ను పరిశీలించి కొత్త మెనూ ప్రకారము పిల్లలకు భోజనం పెట్టాలని ప్రవీణ్ కుమార్ రెడ్డి వార్డెన్ ను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎం ఇ ఓ వెంకట్, ఎం ఆర్ ఓ గోవిందమ్మ, ఎంపీ డి ఓ , వార్డెన్ గీత, సిబ్బంది సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 'బ్లడ్‌మనీకి అంగీకరించం.. నిమిష ప్రియకు శిక్ష పడాల్సిందే'

**న్యూఢిల్లీ :** కేరళ నర్సు నిమిష ప్రియ కేసులో తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. నేడు అమలుకావాల్సిన ఆమె మరణ శిక్షను యెమెన్ ప్రభుత్వం తాత్కాలికంగా వాయిదా వేయడంతో కాస్త ఊరట లభించింది. అయితే మృతుడు తలాల్ అదిబ్ మెహది కుటుంబం మాత్రం ఆమెకు శిక్ష పడాల్సిందేనని పట్టుబడు తోంది. నేరానికి క్షమాపణ ఉండదని మృతుడు సోదరుడు అబ్దుల్ ఫత్తా మెహది స్పష్టంచేశారు. ఆమెకు శిక్ష పడాల్సిందేనని, బ్లడ్‌మనీకి అంగీకరించబోమని వెల్లడించారు. శిక్ష అమలు వాయిదా అనంతరం అతడు ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టారు. "మధ్యవర్తిత్వం, సయోధ్య కోసం ప్రస్తుతం జరుగుతోన్న ప్రయత్నాలు కొత్తవేమీ కావు. మాకు ఎలాంటి ఆశ్చర్యాన్ని కలిగించడం లేదు. అలాగే మేం ఎదుర్కొన్న ఒత్తిళ్లు మా అభిప్రాయాన్ని మార్చవు. ఈ వాయిదాను మేం ఊహించలేదు. డబ్బుతో మనిషి ప్రాణానికి వెలకట్టలేం. మాకు న్యాయం దక్కాల్సిందే" అని అర్థం వచ్చేలా పోస్టులో రాసుకొచ్చారు. అలాగే దోషిని బాధితురాలిగా చిత్రీకరించే ప్రయత్నం చేయొద్దని వ్యాఖ్యానించారు. కాగా.. నిమిష మరణశిక్ష వాయిదా పడిన విషయాన్ని భారత విదేశీ వ్యవహారాల శాఖ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. యెమెన్ జైలు అధికారులతోపాటు ప్రాసిక్యూషన్ కార్యాలయంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. "నిమిష, బాధిత కుటుంబాలు పరస్పర అంగీకారానికి వచ్చి కేసును పరిష్కరించుకునేందుకు మరింత సమయం ఇవ్వాలని గత కొన్ని రోజులుగా యెమెన్ ప్రభుత్వాన్ని భారత్ కోరుతోంది.

## రెడిట్ అకౌంట్ కనిపించలేదని అమెరికా వీసా హెూల్డ్

### భారతీయ విద్యార్థి ఆవేదన




**న్యూఢిల్లీ :** అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే భారతీయ విద్యార్థులకు 'సోషల్ మీడియా వెట్టింగ్' కఠిన సవాలుగా మారుతోంది. సామాజిక మాధ్యమ ఖాతాల వివరాలు వెల్లడించని కారణంగా వీసా దరఖాస్తులను ఎంబసీ నిలిపివేస్తోంది. తాజాగా ఓ విద్యార్థికి ఇలాంటి అనుభవమే ఎదురైంది. రెడిట్ అకౌంట్ కన్పించలేదని వీసాను హెూల్డ్ చేశారు. అయితే, తాను పబ్లిక్‌లోనే ఉంచానని, అయినప్పటికీ తనను తిప్పి పంపారని ఆ విద్యార్థి ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీనిపై ఆ విద్యార్థి చేసిన పోస్ట్ నెట్టింట చర్చనీయాంశంగా మారింది. "ఎఫ్-1 వీసా వ్యక్తిగత ఇంటర్వ్యూ కోసం ఇటీవల యూఎస్ ఎంబసీ కార్యాలయానికి వెళ్లా. అప్పటికే నా రెడిట్ ఖాతాను పబ్లిక్ యాక్సెస్‌లో పెట్టా. అందులో ఎలాంటి అభ్యంతరకర, హింసాత్మక కంటెంట్ కూడా లేదు. అందుకే దాన్ని డీఎస్-160 వీసా దరఖాస్తులో పేర్కొనలేదు. అయితే, ఇంటర్వ్యూ చేసే అధికారిణి మాత్రం ఆ ఖాతా వివరాలను ఎందుకు బహిర్గతం చేయలేదని అడిగారు. ఆ ఖాతా పబ్లిక్‌లోనే ఉందని చెప్పా. కానీ, ఆమె మాత్రం రెడిట్ ప్లాట్‌ఫా మ్‌లో నా అకౌంట్ వివరాలు కన్పించలేదని చెప్పి దరఖాస్తును హెూల్డ్‌లో పెట్టారు. నాకు 221(జీ) స్లిప్ ఇచ్చారు" అని సదరు విద్యార్థి తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. సాంకేతిక సమస్య కారణంగా ఆ అకౌంట్ కన్పించకపోవచ్చుని, దాని ఆధారంగా వీసా ప్రక్రియను ఎలా నిలిపివేస్తారని ఆ విద్యార్థి ఆవేదన వ్యక్తంచేశారు. డీఎస్-160 వీసా అప్లికేషన్‌లో అభ్యర్థులు గత ఐదేళ్ల నుంచి వినియోగిస్తున్న సోషల్ మీడియా 'యూజర్‌నేమ్'లు, హ్యాండిల్స్‌ను కచ్చితంగా వెల్లడించాల్సిందేనని ఇప్పటికే అమెరికా స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం.. స్టూడెంట్స్, ఎక్స్ఛేంజీ విజిటర్స్ వంటి నాన్ ఇమిగ్రెంట్స్ వీసాలకు దరఖాస్తు చేసుకునేవారు... ఫేస్‌బుక్, యూట్యూబ్, లింక్డ్‌ఇన్, ఎక్స్ సహా ఇతర వేదికలపై ఉన్న ఐడీలను అప్లికేషన్‌లో వెల్లడించి తీరాల్సిందే. అంతేకాదు.. తమ ప్రైవసీ సెట్టింగ్స్‌ను ప్రైవేటు నుంచి పబ్లిక్‌కు మార్చుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ ఆ వివరాలను ఇవ్వకపోతే 221(జీ) స్లిప్పులు జారీ చేస్తారు. దానర్థం.. వీసా దరఖాస్తు ప్రక్రియకు అదనపు డాక్యుమెంటేషన్ అవసరమని..! దరఖాస్తుదారులు అందుకు సంబంధించిన పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. వెరిఫికేషన్ దశ పూర్తయ్యేంతవరకు వీసా అప్లికేషన్‌ను హెూల్డ్‌లో పెడతారు. దీనివల్ల వీసా జారీ మరింత ఆలస్యమవుతుంది. ఇటీవల విద్యార్థి వీసాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ 221(జీ) నోటీసులు ఇవ్వడం పెరుగుతోందని ఇమిగ్రేషన్ న్యాయవాదులు చెబుతున్నారు.

## గళమెత్తి.. ప్రాణాలు పోగొట్టుకొంది

### లైంగిక వేధింపులతో మృతి చెందిన విద్యార్థిని తండ్రి ఆవేదన



**న్యూఢిల్లీ :** లెక్చరర్ వేధింపుల కారణంగా ఒంటికి నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్న బాలాసోర్ విద్యార్థిని మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తన కుమార్తె ఫిర్యాదు గురించి తెలిసినా చాలామంది అధికారులు పట్టించుకోలేదని బాధితురాలి తండ్రి ఆరోపించారు. ఆయన ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. 'నా కుమార్తె గళమెత్తి మూల్యం చెల్లించుకుంది. నిందితులను కఠినంగా శిక్షించాలి. ఆమె ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేసినప్పుడు ఎస్పీ నాకు కాల్ చేశారు. ఘటనకు పాల్పడిన వారికి శిక్ష పడాలని డిమాండ్ చేశాను. అధికారులకు ఇప్పటికే ఈ సంఘటన గురించి తెలుసు. అయినా చాలామంది దాన్ని పట్టించుకోలేదు. ఫలితం గా నా బిడ్డ ఇలాంటి చర్యకు పాల్పడింది' అని పేర్కొన్నారు. ఈసందర్భంగా కళాశాల అంతర్గత కమిటీ సభ్యులను కూడా అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసినప్పుడు వారు తన కుమార్తెకు అండగా నిలబడలేదని వాపోయారు.

### బాలాసోర్ బంద్..

ఈ ఘటన నేపథ్యంలో ఒడిశాలో పెద్దఎత్తున నిరసనలు చెలరేగాయి. మృతిచెందిన విద్యార్థినికి న్యాయం చేయాలంటూ బిజూ జనతాదళ్ (బీజేడీ) కార్యకర్తలు 'బాలాసోర్ బంద్'కు పిలుపునిచ్చారు. దీంతో కోల్‌కతా- చెన్నై జాతీయరహదారిని దిగ్బంధించారు. పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున చేరుకొని నిరసన తెలిపారు. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో రాష్ట్ర పోలీసులు వారిని అడ్డుకునేందుకు బారికేడ్లను ఏర్పాటుచేశారు. వాటిని తోసుకొనివచ్చేందుకు ప్రయత్నించిన వారిని చెదరగొట్టారు. ఉద్రిక్తతలు తీవ్రమైన నేపథ్యంలో ఆందోళనకారులపై టియర్ గ్యాస్, వాటర్‌ను ప్రయోగించారు. ఈక్రమంలో పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఇక, లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న లెక్చరర్ సమీర్‌సాహును తొలగించాలని కాలేజీ అంతర్గత ఫిర్యాదు కమిటీ (ఐసీసీ) కళాశాల అధికారులకు సిఫార్సు చేసింది. విద్యార్థుల నుంచి వచ్చిన ప్రతికూల స్పందన ఆధారంగా ఈ సిఫార్సు చేసినట్లు ఐసీసీ సమన్వయకర్త జయశ్రీ మిశ్రా తెలిపారు. లెక్చరర్ తన ప్రవర్తనను, బోధనా పద్ధతులను కూడా మార్చుకోవాలని సూచించామన్నారు. అయితే, కళాశాల అధికారులు ఇప్పటివరకు సాహుపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇంటిగ్రేటెడ్ బీఈడీ రెండో సంవత్సరం చదువుతున్న బాధిత విద్యార్థినిని విభాగాధిపతి సమీర్‌సాహు కొన్ని రోజులుగా లైంగికంగా వేధిస్తున్నాడు. తన మాట వినకుంటే భవిష్యత్తు నాశనం చేస్తానని బెదిరించసాగాడు. ఇవి భరించలేని ఆ విద్యార్థిని యాజమాన్యానికి ఫిర్యాదు చేయగా.. ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో కాలేజీలోనే నిరసన చేపట్టిన ఆమె.. జూన్ 12న ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. సోమవారం అర్ధరాత్రి ఆమె ప్రాణాలు కోల్పోయింది.




## తెల్ల షర్టు.. నల్ల ప్యాంటుతో రావొద్దు

### రోహిణి కోర్టు పరిసరాల్లో నిషేధాజ్ఞలు

**న్యూఢిల్లీ :** కొంతమంది న్యాయవాదులను పోలిన దుస్తులను ధరించి మోసాలకు పాల్పడుతున్నట్లు ఢిల్లీలోని రోహిణి కోర్టు బార్ అసోసియేషన్ గుర్తించింది. దీంతో పరిసర ప్రాంతాల్లో కొన్ని నిషేధా జ్ఞలు జారీ చేసింది. కోర్టు పరిసరాల్లో న్యాయవాదులు మాత్రమే తెల్ల షర్టు, నల్ల ప్యాంటు ధరించి రావాలని పేర్కొం ది. ఈమేరకు బార్ అసోసియేషన్ ఓ నోటీసు జారీ చేసింది. అందులో కొంత మంది మధ్యవర్తులు తమను తాము న్యాయవాదులు లేదా వారి గుమస్తాలుగా పేర్కొంటున్నారు. వారు మోసాలకు పాల్పడుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని తెలిపింది. దీంతో గుమస్తాలు, వ్యాజ్యాలు దాఖలు చేసేవారు, సాధారణ ప్రజలు ఎవరూ తెల్ల చొక్కా, నల్ల ప్యాంటు ధరించకూడదని పేర్కొంది. కోర్టు పరిసరాల్లోకి న్యాయవాదులు మాత్రమే అలాంటి దుస్తులు ధరించి రావాలంది. గతంలో ఇలాంటి మోసాలను నివారించేందుకు న్యాయవాదుల గుమస్తాలకు ఐడీ కార్డులను జారీ చేసిన విషయాన్ని గుర్తుచేసింది.

## కోట్ల మంది చనిపోయినా.. యాక్టివ్‌లోనే ఆధార్ కార్డులు



**న్యూఢిల్లీ :** ఆధార్ కార్యక్రమం ప్రారంభమైన దగ్గరినుంచి కేవలం 1.15 కోట్ల కార్డు నంబర్లను మాత్రమే డీయాక్టివేట్ చేసినట్లు ఉడాయ్ వెల్లడించింది. ఇప్పటివరకు కోట్ల మంది చనిపోయినా నిలిపివేసిన కార్డు నంబర్ల సంఖ్య తక్కువగా ఉండటం గమనార్హం. సమాచార హక్కు చట్టం కింద దాఖలు చేసిన దరఖాస్తు ద్వారా ఈ విషయం వెల్లడైందని ఓ జాతీయమీడియా కథనం పేర్కొంది. 16 ఏళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం ఆధార్ ప్రోగ్రామ్‌ను ఆవిష్కరించింది. 2025 జూన్ నాటికి 142.39 కోట్ల ఆధార్ కార్డులు ఉన్నాయి. యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ ప్రకారం.. దేశ జనాభా 146.39 కోట్లుగా ఉంది. మరోవైపు సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ డేటా ప్రకారం.. 2007 నుంచి 2019 మధ్యలో సగటున ప్రతిఏటా 83.5 లక్షల మంది మృతి చెందారు. ఇలా ఇన్నేళ్లలో కోట్లమంది మరణించినా.. ఉడాయ్ డీయాక్టివేట్ చేసిన కార్డు నంబర్ల సంఖ్య స్వల్పంగా ఉంది. 10 శాతం ఆధార్‌లను మాత్రమే నిలిపివేసింది. ఈ ప్రక్రియ మరణ ధ్రువీకరణపత్రం, కుటుంబసభ్యులు ఇచ్చే సమాచారం ఆధారంగా జరుగుతుందని దరఖాస్తుదారుడికి ఉడాయ్ సమాధానం ఇచ్చింది. ఈ వ్యత్యాసంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. యాక్టివ్‌గా ఉన్న ఆధార్‌లను దుర్వినియోగం చేసే అవకాశాలుంటాయని, అలాగే ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఈ ఐడీ లింక్ ఉన్న ఇతర సర్వీసులపైనా ప్రభావం ఉంటుందని పలువురు నిపుణులు హెచ్చరిస్తున్నారు. నకిలీలను నివారించేందుకు సివిల్ డెత్ రిజిస్ట్రీలు, ఆధార్ డేటాబేస్ నిర్వహణలో సమన్వయం ఉండాలని, ఇది తక్షణ అవసరమని వెల్లడించారు.

## గల్వాన్ ఘర్షణల తర్వాత తొలిసారి.. చైనా పర్యటనకు మోదీ



**న్యూఢిల్లీ :** లద్దాఖ్ సరిహద్దుల్లో సైనికుల మధ్య ఘర్షణతో భారత్-చైనా మధ్య స్తంభించిన దౌత్య సంబంధాలను పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ తరుణం లో ఓ కీలక పరిణామం చోటుచేసు కోనుంది. మరికొన్ని రోజుల్లో భారత ప్రధాని నరేంద్రమోదీ చైనా పర్యటనకు వెళ్లను న్నట్లు తెలుస్తోంది. వచ్చే నెలలో జరిగే ఎస్‌సీఓ సదస్సుకు ప్రధాని హాజరుకా నున్నట్లు సమా చారం. ఈమేరకు విశ్వ సనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఆగస్టు 31-సెప్టెంబరు 1 తేదీల్లో తియాంజిన్ వేదికగా షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఈ భేటీలో మోదీతో పాటు రష్యా అధినేత పుతిన్, ఇతర దేశాధినేతలు పాల్గొనున్నట్లు సమాచారం. బీజింగ్ పర్యటనలో భాగంగా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దేశాధినేతలిద్దరూ గతేడాది అక్టోబరులో రష్యాలో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా ముఖాముఖీగా సమావేశమైన సంగతి తెలిసిందే. 2020 తర్వాత నుంచి మోదీ చైనాకు వెళ్లడం మళ్లీ ఇప్పుడే కానుంది. తొలిసారిగా 2015లో బీజింగ్‌కు వెళ్లిన భారత ప్రధాని.. ఇప్పటివరకు ఐదుసార్లు ఆ దేశంలో పర్యటించారు. అయితే, ఐదేళ్ల క్రితం తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో ఇరుదేశాల మధ్య సైనికుల ఘర్షణతో సంబంధాలు దెబ్బతిన్నాయి. వీటిని పునరుద్ధరించేందుకు ఇప్పుడు చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చైనాలో పర్యటించి జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో ఇటీవలి పరిణామాల గురించి వీరివురూ చర్చించారు. అంతకుముందు ఎస్‌సీవో సభ్యదేశాల విదేశాంగ మంత్రుల సదస్సులో జైశంకర్ ప్రసంగిస్తూ.. ఉగ్రవాద సవాళ్లను ఎదుర్కొనే విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదని గట్టిగా చెప్పారు. జమ్మూకశ్మీర్‌ను పర్యాటకంగా దెబ్బతీసి, మతపరమైన విభజన తెచ్చేందుకే పహల్గాంలో ఉగ్రవాదులు దాడి చేశారని.. పాక్, చైనా మంత్రుల సమక్షంలోనే తెలిపారు. సభ్యదేశాల ప్రాదేశిక సార్వభౌమత్వాన్ని అందరూ గౌరవించాల్సిందేనన్నారు.

## నిన్నటి ఆయుధాలతో నేటి యుద్ధం జయించలేం


### సీడీఎస్ అనిల్ చౌహాన్



**న్యూఢిల్లీ :** భారత్ తన రక్షణ సామర్థ్యాలను తక్షణం మెరుగుపరుచుకోవాల్సి ఉందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్ స్పష్టం చేశారు. రేపటి టెక్నాలజీని వినియో గించి ఇవాళ యుద్ధరంగంలో పోరాడాల్సిన పరిస్థితులు నెలకొని ఉన్నాయన్నారు. అలాంటి నిన్నటి ఆయుధాలతో నేడు యుద్ధం చేసి జయించలేమని వ్యాఖ్యానించారు. బుధవారం దిల్లీలో జరిగిన ఒక వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. "మన వ్యూహాత్మక మిషన్లకు కీలకమైన సాంకేతి కత కోసం విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలి. దిగుమతి చేసుకున్న టెక్నాలజీపై ఆధారపడటం వల్ల మన సంసిద్ధత దెబ్బతింటుంది" అని స్వదేశీ సాంకేతికతను వేగంగా అభివృద్ధి చేసుకోవాల్సిన ఆవశ్యకతను చౌహాన్ మరోసారి గుర్తుచేశారు. ఇక ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ ప్రయోగించిన డ్రోన్లు, ఆయుధాలను సమర్థవంతంగా నిర్వీర్యం చేశామని, వాటివల్ల భారత సైన్యం, పౌరులకు చెందిన మౌలిక సదుపాయాలకు ఎలాంటి నష్టం కలగలేదని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఆత్మనిర్భర్ భారత్ గురించి చౌహాన్ గతంలో కీలక వ్యాఖ్యలు చేశారు. "పాకిస్థాన్ సొంత రక్షణవ్యవస్థలు బలంగా లేకపోవడంతో చైనాపై ఆధారపడింది. భారత్ ఆకాశ్ వంటి స్వదేశీ వ్యవస్థలనే ఉపయోగించింది. స్పేస్, శాటిలైట్ ఇంటెలిజెన్స్ అందరికీ అందుబాటులో ఉంది. మేము మా సొంత శాటిలైట్ వనరులతో సమర్థవంతంగా ఉగ్రశిబిరాలపై దాడులు నిర్వహించాం. ఆ సమయంలో చైనా లేదా విదేశీ శాటిలైట్ చిత్రాలపై దాయాది దేశం ఆధారపడింది" అని అన్నారు. స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు, పెద్ద పరిశ్రమలు ఇప్పుడు రక్షణవ్యవస్థలో పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. "యుద్ధమంటూ వచ్చినప్పుడు నష్టం జరుగుతుంది. అయితే, నష్ట తీవ్రత కంటే.. ప్రత్యర్థులపై మన స్పందన ఎలా ఉందనేది ముఖ్యం. కేవలం మూడు రోజుల్లోనే సమర్థవంతంగా, పౌరులకు ఎలాంటి నష్టం కలిగించకుండా మేం స్పందించాం" అని చెప్పారు. భారత్ దీర్ఘకాల యుద్ధాలను ఎప్పుడూ కోరుకోదని.. దానివల్ల దేశ అభివృద్ధి మందగిస్తుందన్నారు. అలాగే రక్షణ రంగంలో ఆటోమేషన్ విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు

## రష్యాతో వ్యాపారం చేస్తే భారత్‌పై 100 శాతం సుంకం

### నాటో హెచ్చరికలు



**నాటో :** ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని ఆపేందుకు రష్యాను ఆర్థికంగా దెబ్బతీసేలా అమెరికా ప్రయత్నిస్తుంది. అందులో భాగంగా ఆ దేశంతో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తున్న దేశాలపై సుంకాలు విధిస్తామని బెదిరింపుల కు పాల్పడింది. ఈ క్రమంలో మాస్కో వ్యాపార సంబంధాలు కొనసాగిస్తే 100 శాతం సుంకం విధిస్తామని భారత్‌తో సహా చైనా, బ్రెజిల్ దేశాలను నాటో హెచ్చరించింది. నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టె అమెరికా సెనెటర్లతో సమావేశ మయ్యారు. అనంతరం ఆయన మా ట్లాడుతూ.. 'చైనా అధ్యక్షుడు, భారత ప్రధాని, బ్రెజిల్ అధ్యక్షుడు ఎవరైనా రష్యాతో వ్యాపారం చేస్తూ.. వారి నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తే తీవ్రంగా పరిగణిస్తాం. ఆయా దేశాలపై 100 శాతం సుంకం విధిస్తాం. మాస్కోలోని ఆ వ్యక్తి (వ్లాదిమిర్ పుతిన్‌ను ఉద్దేశిస్తూ) శాంతి చర్చలకు రాకపోతే పరిస్థితి తీవ్రంగా ఉంటుంది. మా పరిణామాలు ఈ దేశాలను తీవ్రంగా దెబ్బతీస్తాయి. కాబట్టి వ్లాదిమిర్ పుతిన్‌కు వెంటనే ఫోన్ చేసి శాంతి చర్చలను సీరియస్‌గా తీసుకోవాలని ఒత్తిడి తీసుకురండి. లేకుంటే మూడు దేశాలకు భారీ ఎదురుదెబ్బలు తగులుతాయి' అని హెచ్చరికలు చేశారు. ఈసందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉక్రెయిన్‌కు ఎయిర్‌డిఫెన్స్‌లు మాత్రమే కాకుండా క్షిపణులు భారీగా సరఫరా చేయనున్నారని వెల్లడించారు. ఇక, రష్యాపై ట్రంప్ తీసుకుంటున్న చర్యలను యూఎస్ రిపబ్లికన్ సెనెటర్ థామ్ టిల్లిస్ ప్రశంసించారు. కానీ, 50 రోజుల వరకు సమయం ఇవ్వడం తనను ఆందోళనకు గురిచేస్తుందన్నారు. ఈ సమయంలో పుతిన్ యుద్ధంలో గెలవడానికి ప్రయత్నిస్తారన్నారు. హత్యలు చేసి, మరింత భూభాగాన్ని కాజేసి ఆ తర్వాత శాంతి చర్చలకు వచ్చేందుకు ముందు కొస్తారన్నారు. ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్ యుద్ధం ముగింపు వ్యవహా రంలో రష్యా వైఖరిపై ట్రంప్ సీరియస్‌గా ఉన్నారు. ఈసందర్భంగా యుద్ధం ముగిం పునకు 50 రోజుల్లోపు ఒప్పందం కుదుర్చుకోకపోతే పెద్దఎత్తున టారిఫ్‌లు విధిస్తామని మాస్కోను హెచ్చరించారు. అయితే, ఈ బెదిరింపులను రష్యా కొట్టి పారేసింది. అదనపు ఆంక్షలను ఎదుర్కొనేందుకు తాము సన్నద్ధంగా ఉన్నట్లు ఆ దేశ విదేశాంగశాఖ మంత్రి సెర్గెయ్ లావ్రోవ్ పేర్కొన్నారు.




# తప్పేం లేదు..

## కోహ్లీ టెస్టుల నుంచి రిటైర్మెంట్ వెనక్కి తీసుకోవాలి

### భారత మాజీ క్రికెటర్

విరాట్ కోహ్లీ తన రిటైర్మెంట్‌పై వెనక్కి తగ్గి తిరిగి టెస్ట్ క్రికెట్ ఆడాలని భారత మాజీ ఆల్‌రౌండర్, 1983 ప్రపంచ కప్ హీరో మదన్ లాల్ విజ్ఞప్తి చేశారు. ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌కు ముందు కోహ్లీ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అతను తీసుకున్న నిర్ణయం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో భారత్ ప్రస్తుతం 1–3తో వెనుకబడి ఉంది. సీనియర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ లేకపోవడం భారత్‌కు సవాలుగా మారిందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మదన్‌లాల్ తాజాగా ఓ షోలో పాల్గొనగా కోహ్లీ రిటైర్మెంట్ విషయం ప్రస్తావనకు వచ్చింది. 'భారత క్రికెట్ పట్ల విరాట్ కోహ్లీకి ఉన్న మక్కువ అసమానమైనది. అతను మళ్లీ టెస్టు క్రికెట్ ఆడాలనేది నా కోరిక. రిటైర్మెంట్‌పై వెనక్కి తగ్గడంలో తప్పు లేదు. ఈ సిరీస్‌లో కాకపోయినా తదుపరి సిరీస్‌లో కోహ్లీ తిరిగి రావాలి. కోహ్లీ పునరాగమనం టీమ్‌ఇండియాకు పెద్ద బూస్ట్‌ను ఇస్తుంది. అతని ఎనర్జీ, అనుభవం, ప్రభావం అమూల్యమైనవి. ఈ లక్షణాలు యువ ఆటగాళ్లకు స్ఫూర్తినిస్తాయి. ఒత్తిడిలో జట్టు స్థిరంగా ఉండటానికి సహాయపడతాయి' అని మదన్‌లాల్ అభిప్రాయపడ్డారు.

# అగ్రస్థానంలో బుమ్రా..

## టాప్‌-10లో ఐదుగురు ఆస్ట్రేలియా బౌలర్లు




ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో టెస్టులో ఏడు వికెట్లు పడగొట్టిన టీమ్‌ఇండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా (901) టెస్టు ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. రెండో స్థానంలో ఉన్న కగిసో రబాడ (851) బుమ్రాకు మధ్య 50 రేటింగ్ పాయింట్ల వ్యత్యాసం ఉంది. వెస్టిండీస్‌తో జరిగిన పింక్ బాల్ టెస్టులో హ్యాట్రిక్ సహా ఆరు వికెట్లు తీసిన ఆసీస్ పేసర్ స్కాట్ బోలాండ్ ఆరు స్థానాలు ఎగబాకాడు. ఈ క్రమంలో బోలాండ్ ఆరో స్థానంలో నిలిచి కెరీర్‌లో బెస్ట్ ర్యాంకు అందుకున్నాడు. ఆస్ట్రేలియా బౌలర్లు పాట్ కమిన్స్ (3వ), హేజిల్‌వుడ్ (4వ), నాథన్ లైయన్ (8వ), మిచెల్ స్టార్క్ (10వ) స్థానాల్లో కొనసాగుతున్నారు. దీంతో టాప్‌–10లో ఐదుగురు ఆస్ట్రేలియా బౌలర్లు ఉన్నట్లయింది. ఆసీస్‌తో జరిగిన డే/నైట్ టెస్టులో ఎనిమిది వికెట్లు తీసిన విండీస్ ఫాస్ట్‌బౌలర్ షమార్ జోసెఫ్ 15 స్థానాలు ఎగబాకి 14వ ర్యాంకులో నిలిచాడు. లార్డ్స్ టెస్టులో నాలుగు వికెట్లు తీసిన భారత స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ 12 స్థానాలు మెరుగై 46వ ర్యాంకుకు చేరుకున్నాడు.

### బ్యాటింగ్ ర్యాంకింగ్స్ విషయానికొస్తే..

ఇంగ్లాండ్ బ్యాటర్ జో రూట్ (888) తిరిగి అగ్రస్థానానికి చేరుకున్నాడు. భారత్‌తో జరిగిన మూడో టెస్టులో రూట్ (104, 40) రాణించిన సంగతి తెలిసిందే. హ్యారీ బ్రూక్ (862) మూడో స్థానానికి పడిపోగా.. కేన్ విలియమ్సన్ (867) రెండో ప్లేస్‌కు చేరుకున్నాడు. యశస్వి జైస్వాల్ (801)ను వెనక్కినెట్టి స్టీవ్ స్మిత్ (816) నాలుగో స్థానంలో నిలిచాడు. రిషభ్ పంత్ ఒక స్థానం డౌన్ అయి ఎనిమిదో స్థానానికి, శుభ్‌మన్ గిల్ మూడు స్థానాలు దిగజారి తొమ్మిదో ర్యాంక్‌కు పడిపోయారు. రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్ ఐదేసి స్థానాలు మెరుగై వరుసగా 34, 35 ర్యాంక్‌ల్లో నిలిచారు.



# ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు..

## 25,200 ఎగువన నిఫ్టీ

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. త్రైమాసిక ఫలితాల సీజన్ కావడం, భారత్– అమెరికా మధ్య ట్రేడ్ డీల్‌పై ఇంకా స్పష్టత రాకపోవడంతో మదుపర్లు అప్రమత్తత పాటిస్తున్నారు. ఈ క్రమంలో ఉదయం నష్టాల్లో ట్రేడయిన సూచీలు.. రోజంతా ఓ మోస్తరు శ్రేణిలో కదలాడి స్వల్ప లాభాల్లో ముగిశాయి. ప్రభుత్వరంగ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. సెన్సెక్స్ ఉదయం 82,534.66 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,570.91) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. ఉదయమంతా దాదాపు నష్టాల్లోనే కొనసాగింది. మధ్యాహ్నం తర్వాత లాభాల బాట పట్టింది. ఇంట్రాడేలో 82,784.75 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 63 పాయింట్ల లాభంతో 82,634.48 వద్ద ముగిసింది. నిఫ్టీ 16.25 పాయింట్ల లాభంతో 25, 212.05 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.94గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో మహీంద్రా అండ్ మహీంద్రా, టెక్ మహీంద్రా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇన్ఫోసిస్, అదానీ పోర్ట్స్ ప్రధానంగా లాభపడ్డాయి. ఎటర్నల్, సన్‌ఫార్మా, టాటా స్టీల్, టాటా మోటార్స్, బీఈఎల్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 68.50 డాలర్ల వద్ద కొనసాగుతుండగా..బంగారం ఔన్సు 3,347 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# ఏప్రిలియా నుంచి 175 సీసీ స్కూటర్.. ధర ఎంతంటే?



ఇటలీకి చెందిన స్కూటర్ కంపెనీ ఏప్రిలియా ప్రీమి యం శ్రేణిలో ఎస్ఆర్ 175 పేరిట కొత్త స్కూట ర్‌ను మార్కెట్‌లోకి విడు దల చేసింది. దీని ప్రారంభ ధర రూ.1.26 లక్షలు (ఎక్స్‌–షోరూమ్ )గా నిర్ణయించింది. గతంలో తీసుకొచ్చిన ఎస్ఆర్ 160 స్థానంలో 175 మోడల్‌ను విడుదల చేశారు. లుక్ పరంగా ఇది ఎస్ఆర్ 160 మోడల్‌ను పోలి ఉన్నప్పటికీ అధిక సామర్థ్యం కలిగిన ఇంజిన్ ఉండడంతో మెరుగైన పనితీరు కనబరుస్తుంది. ఈ ప్రీమియం స్కూటర్‌లో 174.7 సీసీ సింగిల్ సిలిండర్ ఎయిర్‌–కూల్డ్ ఇంజిన్‌ను త్రీ వాల్వ్ సెటప్‌తో తీసుకొచ్చారు. ఇది 7200 ఆర్‌పీఎం వద్ద 12.92హెచ్‌పీ శక్తిని ఉత్పత్తి చేస్తుంది. ఎస్ఆర్ 160లో 11.27 హెచ్‌పీ మాత్రమే ఉండేది. పీక్ టార్క్ కూడా 13.44 ఎన్ఎం నుంచి 14.14 ఎన్ఎంకు పెరిగింది. కలర్ టీఎఫ్‌టీ డిస్‌ప్లే బ్లూటూత్ కనెక్టివిటీతో వస్తోంది. కాల్ నోటిఫికేషన్‌లు, అలర్ట్‌లు, మ్యూజిక్ కోసం స్మార్ట్‌ఫోన్‌ను దీనికి కనెక్ట్ చేయొచ్చు. ఫ్రేమ్, సస్పెన్షన్, బ్రేక్‌లు, టైర్లు వంటి భాగాలు ఎస్ఆర్160 మోడల్ మాదిరిగానే ఉంటాయి. ఈ స్కూటర్ ముందు, వెనక 14 అంగుళాల టైర్లను అమర్చారు. వెడల్పు 120 సెక్షన్ ఉంటుంది. బ్రేకింగ్ సింగిల్ ఛానల్ ఏబీఎస్‌తో ఉన్న ఫ్రంట్ డిస్క్, వెనక డ్రమ్ బ్రేక్‌తో పనిచేస్తుంది. ఇది రెడ్‌–వైట్ లేదా పర్పుల్‌–రెడ్ కాంబినేషన్‌లో వస్తోంది. వినియోగదారులను ఆకర్షించేలా బ్రాండ్ మిడిల్ వెయిట్ స్పోర్ట్ బైక్ ఆర్ఎస్ 457ను పోలిన కొత్త పెయింట్ స్కీమ్‌తో దీన్ని తీర్చిదిద్దారు. స్పోర్టీ డిజైన్‌తో రావడం వల్ల హీరో జూమ్ 160, యమహా ఏరోక్స్ 155 వంటి వాహనాలకు గట్టి పోటీ ఇస్తుంది.

# విమానయాన రంగంలోకి జొమాటో సీఈఓ

## ప్రైవేటు జెట్ కొనుగోలు




ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో మాతృ సంస్థ ఎటర్నల్ వ్యవస్థాపకుడు, సీఈఓ పౌర విమానయాన రంగంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే 'ఎల్‌ఏటీ ఏరోస్పేస్' పేరుతో ఏవియేషన్ వెంచర్‌ను ప్రారంభించిన ఆయన.. తాజాగా ఓ ప్రైవేటు జెట్‌ను కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. బాంబర్డియర్ గ్లోబల్ సిరీస్‌కు చెందిన లగ్జరీ ప్రైవేటు జెట్‌ను ఎల్‌ఏటీ ఏరోస్పేస్ కొనుగోలు చేసినట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ బాంబర్డియర్ విమానం ఈ ఏడాది జూన్ నుంచి దిల్లీ ఎయిర్‌పోర్టులోని వీఐపీ బే వద్ద కన్పిస్తోంది. జులై 16 నుంచే దీని కార్యకలాపాలు ప్రారంభం కానున్నట్లు ఆ కథనాల సమాచారం. ఈ విమానం నిర్వహణ, ఇంజినీరింగ్ బాధ్యతలను ఇందమెర్ ఎంజెట్స్ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్, బర్డ్ ఎగ్జిక్యూజెట్ ఎయిర్‌పోర్టు సర్వీసెస్ కంపెనీలకు అప్పగించినట్లు తెలుస్తోంది. కాగా.. ఈ ప్రైవేట్ జెట్ మోడల్, ఇతర ఫీచర్స్ గురించి ఇంకా తెలియరాలేదు. దీపిందర్ గోయల్ ఇటీవలే ఓ లగ్జరీ అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేసి వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. గురుగ్రామ్‌లోని డీఎల్‌ఎఫ్‌లో గల ఈ అపార్ట్‌మెంట్‌ను ఏకంగా రూ.52.3 కోట్లకు సొంతం చేసుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం.. ఈ ఏడాది జూన్ నాటికి దీపిందర్ గోయల్‌కు జొమాటోలో 3.83 శాతం వాటాలున్నాయి. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం.. ఆయన వాటాల విలువ రూ.9,847కోట్లుగా ఉంది. దీంతో గోయల్ నికర సంపద 1.6 బిలియన్ డాలర్ల పైనే ఉన్నట్లు ఫోర్బ్స్ వెల్లడించింది.

# చాట్‌జీపీటీ డౌన్.. చాట్‌బాట్‌లో ఎర్రర్ మెసేజ్‌లు



కృత్రిమ మేధ ఆధారిత చాట్‌బాట్ చాట్‌జీపీటీ సేవలకు అంతరాయం ఎదురైంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా అనేకమంది యూజర్లు ఈ సర్వీసులను పొందలేకపోతున్నారు. చాట్‌బాట్‌ను ఓపెన్ చేస్తుంటే.. చాట్ హిస్టరీ లోడ్ అవ్వట్లేదని పలువురు యూజర్లు సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టులు పెడుతున్నారు. చాట్ చేయడానికి యత్నిస్తుంటే 'అసాధారణ ఎర్రర్' మెసేజ్‌లు వస్తున్నాయని పేర్కొంటున్నారు. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ఉత్తర అమెరికా, ఐరోపా, ఆసియా దేశాల్లోని యూజర్లకు ఈ సమస్య ఎదురైనట్లు తెలుస్తోంది. దాదాపు 82 శాతం మంది యూజర్లు చాట్‌జీపీటీ సేవలను పొందలేకపోతున్నారని డౌన్‌డిటెక్టర్ వెల్లడించింది. దీనిపై 'ఓపెన్‌ఏఐ సంస్థ స్పందించింది. సమస్యను గుర్తించామని, దాన్ని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. చాట్‌జీపీటీ రికార్డ్ మోడ్, సోరా, కోడెక్స్ వంటి సేవల్లో అంతరాయం ఉన్నట్లు తెలిపింది. త్వరలోనే సమస్యను పరిష్కరించి సేవలను అందుబాటులోకి తెస్తామని తెలిపింది. చాట్‌జీపీటీ సేవలు డౌన్ అవడం ఈ నెలలో ఇది రెండోసారి కావడం గమనార్హం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పనిచేసే చాట్‌జీపీటీని 2022లో అందుబాటులోకి తెచ్చారు. ఈ చాట్‌బాట్ సహాయంతో కేవలం సెకన్లలోనే ఎలాంటి క్లిష్ట ప్రశ్నకైనా సమాధానం లభిస్తోంది. దీంతో చాలామంది ఈ టూల్‌ను వాడేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అందుకు అనుగుణంగానే కంపెనీ కూడా ఈ చాట్‌బాట్‌లో ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్లు తీసుకొస్తూ వినియోగదారులను ఆకట్టుకుంటోంది. అయితే, దీనిపై అతిగా ఆధారపడటం మంచిది కాదని స్వయంగా చాట్‌జీపీటీ సృష్టికర్త, ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్టమన్ హెచ్చరించడం గమనార్హం.

# జియోబ్లాక్‌రాక్ నుంచి 5 మ్యూచువల్ ఫండ్ స్కీమ్స్

## సెబీ ఆమోదం




**దిల్లీ:** మ్యూచువల్ ఫండ్ స్కీమ్స్ లాంచ్ చేసేందుకు జియో బ్లాక్‌రాక్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీకి సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్లాక్‌రాక్ సంస్థల జాయింట్ వెంచర్ అయిన ఈ కంపెనీ ఐదు స్కీమ్స్‌ను తీసుకొచ్చేందుకు ఆమోదం తెలిపింది. జియోబ్లాక్‌రాక్ నిఫ్టీ 50 ఇండెక్స్ ఫండ్, జియోబ్లాక్‌రాక్ నిఫ్టీ 8–13 సంవత్సరాల జీ–సెక్ ఇండెక్స్ ఫండ్, జియోబ్లాక్‌రాక్ నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 ఇండెక్స్ ఫండ్, జియోబ్లాక్‌రాక్ నిఫ్టీ నెక్ట్స్ 50 ఇండెక్స్ ఫండ్, జియోబ్లాక్‌రాక్ నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్ ఫండ్ పేరిట మ్యూచువల్ ఫండ్ కార్యకలాపాలు నిర్వహించేందుకు అనుమ తి లభించింది. ఈ ఐదు పథకాల్లో నాలుగు ఈక్విటీ ఆధారిత ఇండెక్స్ ఫండ్లు కాగా.. ఒకటి డెట్ ఫండ్. జులై 7న తన తొలి న్యూఫండ్ ఆఫర్‌ను ముగించినట్లు సంస్థ ప్రకటించింది. మొత్తం రూ.17,800 కోట్లు (సుమారు 2.1 బిలియన్ డాలర్లు) ఈ ఆఫర్ ద్వారా సమీకరించబడినట్లు తెలిపింది. ఈ నిధులు 3 మ్యూచువల్ ఫండ్ పథకాల (జియోబ్లాక్‌రాక్ ఓవర్‌నైట్ ఫండ్, జియోబ్లాక్‌రాక్ లిక్విడ్ ఫండ్, జియోబ్లాక్‌రాక్ మనీ మార్కెట్ ఫండ్) ద్వారా సమీకరించినట్లు వెల్లడించింది. మూడు రోజుల ఎన్ఎఫ్ఓలో 90 మందికి పైగా సంస్థాగత పెట్టుబడిదారులు, 67 వేల మందికి పైగా రిటైల్ పెట్టుబడిదా రులు పాల్గొన్నట్లు కంపెనీ తెలిపింది.




# టెక్ మహీంద్రా లాభంలో 34 శాతం వృద్ధి

ప్రముఖ ఐటీ సేవల సంస్థ టెక్ మహీంద్రా త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ జూన్ త్రైమాసికంలో రూ.1140.6 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంతో రూ.851.5 కోట్లతో పోలిస్తే నికర లాభంలో 33.9 శాతం వృద్ధి నమోదైంది. సమీక్షా త్రైమాసికంలో ఆదాయం 2.65 శాతం వృద్ధితో రూ.13,005 కోట్ల నుంచి రూ. 13,351.2 కోట్లకు పెరిగింది. గత త్రైమాసికంతో పోల్చినప్పుడు నికర లాభం 2.2 శాతం క్షీణించగా.. ఆదాయంలోనూ 0.2 శాతం క్షీణత నమోదైంది. కంపెనీలో జూన్ 30 నాటికి 1,48,517 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. గతేడాదితో పోలిస్తే ఉద్యోగుల సంఖ్య 897 పెరిగిందని తెలిపింది. గడిచిన 12 నెలల్లో వలసల రేటు 12.6 శాతంగా ఉన్నట్లు పేర్కొంది. తమ పనితీరు స్థిరంగా బలోపేతం అవుతోందని, డీల్స్‌లో 44 శాతం వృద్ధి నమోదైందని టెక్ మహీంద్రా సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ మోహిత్ జోషి ఫలితాల సందర్భంగా పేర్కొన్నారు. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 1.94 శాతం లాభంతో రూ.1609 వద్ద ముగిసింది.

# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్‌హోల్డర్లకు బొనాంజా?

## 19న బోర్డు కీలక భేటీ

**ముంబయి :** ప్రైవేటు రంగానికి చెందిన బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బోర్డు జులై 19న భేటీ కాబోతోంది. ఈ సమావేశంలో బోనస్ షేర్ల జారీ, మధ్యంతర డివిడెండ్‌పై కీలక నిర్ణయం తీసుకోబోతోంది. ఈ సమావేశంలో బోనస్ షేర్ల జారీకి బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇస్తే.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నుంచి బోనస్ షేర్ల జారీ ఇదే తొలిసారి అవుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్– జూన్ త్రైమాసికానికి (క్యూ1) ఫలితాల ప్రకటనపై జులై 19న బోర్డు భేటీ కాబోతోందని జూన్ 23నే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వెల్లడించింది. తాజాగా బీఎస్ఈకి సమర్పించిన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో ఇదే భేటీలో బోనస్ షేర్ల జారీ, మధ్యంతర డివిడెండ్ పైనా చర్చించనున్నట్లు పేర్కొంది. బ్యాంక్ నుంచి ఈ ప్రకటన వెలువడడంతో బుధవారం బ్యాంక్ షేర్లు 1.33 శాతం పెరిగి రూ.2,021 వద్ద గరిష్ఠాన్ని తాకాయి. బోనస్ షేర్ల జారీ అనేది నియంత్రణ సంస్థలు, వాటాదార్ల ఆమోదానికి లోబడి ఉంటుందని బ్యాంక్ తెలిపింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ గత ఆర్థిక సంవత్సరానికి గానూ చివరి త్రైమాసికంలో ఒక్కో షేరుపై రూ.22 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. బ్యాంక్ షేర్లు కూడా ఇటీవల కాలంలో దూసుకెళ్తున్నాయి. గత ఏడాదిలో షేరు విలువ 23.01 శాతం పెరగ్గా.. గత ఆరు నెలల్లో 21.46 శాతం మేర లాభపడింది. మూడు నెలల్లో 6.99 శాతం రిటర్నులు ఇవ్వగా.. గత నెలలో 4.07 శాతం మేర పెరిగింది. బ్యాంకు మెరుగ్గా రాణిస్తుండడంతో ఇన్వెస్టర్లకు తీపికబురు అందించేందుకు సిద్ధమవుతోంది. మరోవైపు 2011, 2019లో రెండుసార్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్ స్ప్లిట్‌ను ప్రకటించింది.



## 'స్పిరిట్' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా : త్రిప్తి డిమ్రి

ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు నటి త్రిప్తి డిమ్రి. ఆమె నటించిన 'ధడక్ 2' ఆగస్టు 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన అప్‌కమింగ్ చిత్రాల గురించి పంచుకున్నారు. సందీప్ వంగా దర్శకత్వంలో తాను నటించిన 'స్పిరిట్' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. "విభిన్నమైన కథల్లో నటించినప్పుడే నటిగా ఎదుగుదల ఉ ంటుంది. ఇండస్ట్రీలోని టాలెంటెడ్ డైరెక్టర్ల సినిమాల్లో నటించే అవకాశం రావడం గొప్ప బహుమతి. వేర్వేరు వ్యక్తులతో పనిచేయడం మంచి అనుభవం. వారి నుంచి ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోవచ్చు. అవి కెరీర్‌కు ఎంతో ఉ పయోగపడతాయి. నేను విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నాను. ఈ ఏడాదిలోనే అది విడుదల కానుంది. దానితో పాటు 'స్పిరిట్'లో నటిస్తున్నా. దీన్ని సందీప్ వంగా గొప్పగా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం విడుదల కోసం ఉత్సాహంగా ఉన్నాను. 'స్పిరిట్' ఓ అందమైన చిత్రం" అని త్రిప్తి తెలిపారు. జాన్వీ కపూర్ తొలి సినిమా 'ధడక్'. విజయవంతమైన ఈ రొమాంటిక్ ఫిల్మ్‌కు సీక్వెల్‌గా 'ధడక్ 2' రూపొందింది. అయితే ఈ సీక్వెల్‌లోనూ జాన్వీ నటిస్తారని అనుకున్నారు. అయితే ఆమెకు బదులుగా త్రిప్తిని తీసుకున్నారు దర్శకుడు. షాజియా ఇక్బాల్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ధడక్'లో సిద్ధాంత్ చతుర్వేది సరసన త్రిప్తి కనిపించనున్నారు. ఇక ప్రభాస్ హీరోగా రానున్న 'స్పిరిట్' సినిమా కోసం సందీప్ వంగా మొదట దీపికా పదుకొణెను సంప్రదించినట్లు వార్తలు వచ్చాయి. తర్వాత కొన్ని రోజులకు ఈ ప్రాజెక్ట్‌లో త్రిప్తిని తీసుకుంటున్నట్లు టీమ్ ప్రకటించడం గమనార్హం.

## రాష్ట్రపతి భవన్‌లో 'కన్నప్ప' ప్రదర్శన

### విష్ణుపై ప్రశంసలు

మంచు విష్ణు హీరోగా తెరకెక్కిన భక్తి చిత్రం 'కన్నప్ప' దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఈ సినిమాని ప్రత్యేకంగా ప్రదర్శించారు. సినిమా చూసిన సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ అధికారులు.. విష్ణు నటనను కొనియాడారు. ఈ స్పెషల్ షోపై చిత్ర బృందం ఆనందం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది. భక్తి కథ, సాంస్కృతిక ప్రాముఖ్యానికి దక్కిన ఈ గుర్తింపు గర్వకారణమని పేర్కొంది. శివ భక్తుడు కన్నప్ప జీవితాధారంగా రూపొందిన ఈ సినిమా జూన్ 27న బాక్సాఫీసు ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. విష్ణు నటన, ఎమోషన్స్, క్లైమాక్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రుద్రగా ప్రభాస్, శివపార్వతులుగా అక్షయ్‌కుమార్– కాజల్, కిరాతుడిగా మోహన్‌లాల్ అలరించారు. ముకేశ్ కుమార్ సింగ్ దర్శకుడు.



## హెూంబలేలో మూడు భారీ చిత్రాలు

### ప్రభాస్ ఏమన్నారంటే

ప్రభాస్ హీరోగా హెూంబలే ఫిల్మ్స్ మూడు భారీ ప్రాజెక్ట్‌లు చేయనున్నట్లు గతేడాది ప్రకటించిన విషయం తెలిసిందే. ఒకే బ్యానర్‌లో మూడు ప్రాజెక్ట్‌లు చేయడంపై ప్రభాస్ స్పందించారు. ఓ ఆంగ్ల వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో హెూంబలే ఫిల్మ్స్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ బ్యానర్‌లో వర్క్ చేయడం ఎంతో ప్రత్యేకమన్నారు. "విజయ్ కిరంగదూర్ వల్లే హెూంబలే సంస్థ ఈ స్థాయికి చేరింది. తనతో కలిసి వర్క్ చేసే వారిని ఆయన జాగ్రత్తగా చూసుకుంటారు. అందరితో కలివిడిగా ఉంటారు. 'సలార్'తో మా ప్రయాణం మొదలైంది. మేమంతా ఒక కుటుంబంలా మారాం. ఆయన నాకొక కుటుంబ సభ్యుడితో సమానం. నా మాదిరిగానే బయట వారితో ఎక్కువగా కలవరు. 'కేజీయఫ్' షూట్‌లో చోటు చేసుకున్న ఒక సంఘటన నాకు ఇప్పటికీ గుర్తుంది. ఆ సినిమా కోసం ఒక భారీ సెట్ వేయగా అనుకోకుండా అగ్నిప్రమాదం జరిగింది. బడ్జెట్ విషయంలో టీమ్ అందరూ ఎంతో కంగారుపడ్డారు. 'కంగారు పడొద్దు. డబ్బు విషయంలో ఏమాత్రం ఆలోచించవద్దు. అనుకున్న విధంగా సినిమా చేయండి' అని విజయ్ ధైర్యం చెప్పారు. సినిమా మేకింగ్‌కు వచ్చే సరికి క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడరు. ఆ విషయం నాకెంతో నచ్చింది. అందుకే ఆయనతో వరుస ప్రాజెక్ట్‌లు చేస్తున్నా" అని ప్రభాస్ తెలిపారు. విభిన్నమైన కథలతో ప్రేక్షకులకు వినోదాన్ని అందించాలనే లక్ష్యంతో విజయ్ కిరంగదూర్ 'హెూంబలే ఫిల్మ్స్' నిర్మాణ సంస్థను స్థాపించారు. పునీత్ రాజ్‌కుమార్ హీరోగా నటించిన 'నిన్నిందలే'తో నిర్మాణ రంగంలో ఈ సంస్థ ప్రయాణం మొదలైంది. 2018లో విడుదలైన 'కేజీయఫ్' ఈ సంస్థకు గుర్తింపు తెచ్చిపెట్టింది. దీని తర్వాత 'కాంతార', 'సలార్ సీజ్ ఫైర్' వంటి చిత్రాలు ఈ బ్యానర్‌లో నిర్మితమై ఘన విజయాన్ని అందుకున్నాయి. 2023లో వచ్చిన 'సలార్' కోసం ప్రభాస్ వర్క్ చేశారు. దీనికి కొనసాగింపుగా 'సలార్ 2' రానుంది. ప్రభాస్‌తో చేయనున్న మూడు ప్రాజెక్ట్‌లను ఉద్దేశించి గతేడాది చివర్లో ఈ సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. "భారతీయ సినిమా ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసేలా మూడు చిత్రాల భాగస్వామ్యంలో ప్రభాస్‌తో కలిసి వర్క్ చేయడం ఆనందంగా ఉంది. ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమాటిక్ అనుభూతిని సృష్టించాలనే మా నిబద్ధతకు సంబంధించిన ప్రకటన ఇది. వేదిక సిద్ధమైంది. ముందుకుసాగే మార్గం అపరిమితంగా ఉంటుంది.



చ%ఖుశ్రీఖుతీ%2 తో ఈ ప్రయాణం ప్రారంభమవుతుంది" అని తెలిపింది. 2026, 2027, 2028ల్లో ఈ చిత్రాల నిర్మాణం ఉండనున్నట్లు చెప్పింది. 'సలార్ 2' మినహాయించి మిగిలిన ప్రాజెక్టులు ఏమిటనే విషయాన్ని నిర్మాణ సంస్థ తెలియజేయలేదు.

## వార్-2పై పెరుగుతున్న అంచనాలు

### డిఫరెంట్ రోల్‌తో ఎన్టీఆర్ బాలీవుడ్ ఎంట్రీ

ఆడియన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న స్పై యాక్షన్ థ్రిల్లర్ 'వార్ 2'. 2019లో హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ కాంబినేషన్‌లో వచ్చిన మూవీ భారీ హిట్ అయ్యింది. అదే సిరీస్‌కు ఇది సీక్వెల్. ఈసారి కథ మరింత ఇంటెన్స్‌గా ఉండబోతుందన్న అంచనాలు ఉన్నాయి. హృతిక్ మళ్లీ రా ఏజెంట్ మేజర్ కబీర్ ధాలివాల్ పాత్రలో కనిపించబోతుండగా, ఎన్టీఆర్ తొలిసారిగా హిందీ లో పెద్ద స్కోప్ ఉన్న ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నాడు. ఈ చిత్రానికి అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తుండగా, అలాగే, యష్ రాజ్ ఫిలిమ్స్ అధినేత ఆదిత్య చోప్రా ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఇక కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీ నుంచి, అభిమానుల ఎదురు చూపులకు చెక్ పెడుతూ తాజాగా మరో ఆసక్తికర అప్‌డేట్ వచ్చేసింది. ఈ భారీ ప్రాజెక్ట్ నుంచి కౌంట్‌డౌన్ పోస్టర్ విడుదలై బజ్ పెంచింది.






## 'బాహుబలి' రన్‌టైమ్‌పై రూమర్స్

### స్పందించిన రానా

తెలుగు సినిమా స్థాయిని పెంచిన 'బాహుబలి' మరోసారి ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఈ బ్లాక్ బస్టర్ విడుదలై 10 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఇటీవల రాజమౌళి దీని రెండు భాగాలను ఒకే పార్ట్‌లో రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. ఆ ప్రకటన వెలువడిన దగ్గర నుంచి దీని రన్‌టైమ్‌కు సంబంధించిన ఎన్నో వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీని నిడివి 5 గంటలకు పైగానే ఉంటుందని ఒకరు, 4 గంటలు అని మరొకరు పోస్ట్‌లు పెడుతున్నారు. దీంతో రకరకాల వార్తలు నెట్టింట షేర్ అవుతున్నాయి. తాజాగా దీనిపై నటుడు రానా స్పందించారు. 'బాహుబలి' సినిమాలో భల్లాల దేవ పాత్రలో అద్భుతమైన నటనతో ఆకట్టుకున్నారు రానా. తాజాగా ఆయన ఈ సినిమా రన్‌టైమ్‌పై స్పందిస్తూ.. "ఎంత నిడివి ఉన్నా నాకు చాలా ఆనందం. ఎందుకంటే ఈ ఏడాదిలో నేను ఏ సినిమాలో నటించకుండానే నాకు బ్లాక్‌బస్టర్ రానుంది. రన్‌టైమ్ ఎంతనేది నాకు కూడా చెప్పలేదు. నాలుగు గంటలు అని పోస్ట్‌లు పెడుతున్నారు. అంత నిడివి ఉంటే చూస్తారా!. దీని నిడివి కేవలం రాజమౌళికి మాత్రమే తెలుస్తుంది. ఆయన చెప్పేవరకూ ఎవరికీ తెలియదు. నాకైతే ఆయన ఏం చెప్పలేదు" అని అన్నారు. దీంతో దీని రన్‌టైమ్‌పై చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. 'బాహుబలి: ది ఎపిక్ పేరుతో ఇది ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకురానుంది.

## రవితేజకు పితృవియోగం

### రాజగోపాల్ మృతికి పలువురు సంతాపం

టాలీవుడ్‌లో మరో విషాదం నెలకొంది. మాస్ మహారాజా రవితేజ తండ్రి రాజగోపాల్ రాజు (90) మంగళ వారం రాత్రి కన్నుమూశారు. గత కొంత కాలంగా వయో భారం, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఆయన హైదరాబాదులోని రవితేజ నివాసంలో తుది శ్వాస విడిచారు. పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు వారి కుటుంబ సభ్యులకు సోషల్ మీడియా ద్వారా తమ సంతాపం తెలిపారు. రవితేజ తండ్రి భూపతి రాజు రాజగోపాల్ వృత్తి రీత్యా ఫార్మసిస్ట్ గా పని చేసేవారు. ఈ నేపథ్యంలో ఆయన పలు ప్రాంతాలలో ఉ ద్యోగం చేయాల్సి రావడంతో తాను అనేక ప్రాంతాలు చిన్నప్పుడే తిరగాల్సి వచ్చిందని రవితేజ పలు సందర్భాలలో పంచుకున్నారు. అలా అనేక ప్రాంతాలలో పనిచేస్తూ రావడంతోనే రవితేజకు అనేక యాసలు ఒంటబట్టాయని కూడా సన్నిహితులు చెబుతూ ఉంటారు. ఇక రాజగోపాల్ రాజుకు ముగ్గురు కుమారులు రవితేజ, రఘు, భరత్ రాజు. ఇక భూపతి రాజు రాజగోపాల్ రాజు స్వగ్రామం ఆంధ్ర ప్రదేశ్ లోని జగ్గంపేట. మెగాస్టార్ చిరంజీవి సహా చాలా మంది ప్రముఖులు రవితేజ తండ్రి మృతికి సంతాపం తెలియ జేస్తున్నారు. ఈ సందర్భంగా చిరంజీవి తన సోషల్ మీడియా అకౌంట్ ద్వారా.. సోదరుడు రవి తేజ తండ్రి రాజ గోపాల్ రాజు గారి మరణవార్త



విని చాలా బాధపడ్డా ను. ఆయన్ని ఆఖరిసా రిగా వాల్తేర్ వీరయ్య సెట్లో కలిశాను. ఈ కష్ట సమయంలో ఆయన కుటుంబానికి నా హృదయ పూ ర్వక సానుభూతి తెలియ జేస్తున్నాను. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నా ను అని మెగాస్టార్ చిరంజీవి ఓ పోస్ట్ సైతం పెట్టారు.

## ఈ విషయంలో నన్నెవరూ ఆపలేరు : అమితాబ్ బచ్చన్

ముంబయి: తన తనయుడు, నటుడు అభిషేక్‌పై ప్రశంసల వర్షం కురిపించారు బాలీవుడ్ అగ్ర నటుడు అమితాబ్ బచ్చన్. తనయుడి వర్కింగ్ స్టైల్‌ను మెచ్చుకున్నారు. అభిషేక్ నటించిన చిత్రాల గురించి ఆయన మాట్లాడారు. ఈ మేరకు తాజాగా ఎక్స్ వేదికగా ఆసక్తికర పోస్ట్ పెట్టారు. "ఒక ఏడాదిలో 'ఐ వాంట్ టు టాక్', 'హౌస్‌ఫుల్ 5', 'కాళీధర్ లాపత' వంటి మూడు విభిన్నమైన చిత్రాల్లో నటించాడు. ఒక దానితో ఒకటి సంబంధం లేకుండా ఆ మూడు చిత్రాల్లో పాత్రలు పోషించాడు. ఆయా చిత్రాల్లో నాకు ఎక్కడా కూడా అభిషేక్ బచ్చన్ కనిపించలేదు. కేవలం ఆ పాత్ర మాత్రమే కనిపించింది. ఈ రోజుల్లో ఇలా చూడటం ఎంతో ప్రత్యేకమైన విషయం. ఒక పాత్రను పూర్తిస్థాయిలో అంగీకరించి.. అద్భుతంగా యాక్ట్ చేసి.. నటుడిగా నువ్వేంటో ఈ ప్రపంచానికి తెలియజేశావు. ఒక తండ్రిగా నా తనయుడిని ప్రశంసించడాన్ని ఎవరూ ఆపలేరు" అని ఆయన రాసుకొచ్చారు. బాలీవుడ్ అగ్రనటుడు అమితాబ్ బచ్చన్ తనయుడిగా అభిషేక్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. 'రిఫ్యూజీ'తో నటుడిగా మారారు. 'యువ', 'ధూమ్', 'గురు', 'ద్రోణ', 'దోస్తానా', 'ఢిల్లీ 6' వంటి విభిన్నమైన చిత్రాలతో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయారు. ఈ ఏడాదిలో అభిషేక్ నటించిన మూడు చిత్రాలు విడుదలయ్యాయి. సూజిత్ సర్కార్ తెరకెక్కించిన 'ఐ వాంట్ టు టాక్', తరుణ్ దర్శకత్వం వహించిన 'హౌస్‌ఫుల్ 5' మిశ్రమ స్పందనలకే పరిమితమయ్యాయి. ఇటీవల ఆయన నటించిన 'కాళీధర్ లాపత' విడుదలైంది. అనాథ పిల్లల చుట్టూ తిరిగే కథగా ఇది రూపొందింది. 'కరుపు దురై' అనే తమిళ సినిమాకు రీమేక్‌గా ఇది సిద్ధమైంది.



Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com